RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | గురువారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:109 | ఏప్రిల్ 16, 2026 | వెల: రూ.3-00

లింగబత్తిని కృష్ణ
సీఎండీ & ఎడిటర్
9701923260

## రూ. 50 వేలు లంచం తీసుకుంటూ..



ఏసీబీకి చిక్కిన హుజూరాబాద్ మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్

2లో

# పరిశ్రమల పేరుతో రైతుల భూములు లాక్కోవద్దు




## బలవంతపు భూసేకరణ ఆపాలి

- 1200 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవడం దారుణం
- అందులో ఎక్కువ భాగం అసైన్డ్ భూములే
- ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేస్తోంది
- రైతుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తాం
- జాగృతి అధినేత్రి కల్వకుంట్ల కవిత
- పరిగి ఇండస్ట్రియల్ కారిడార్ రైతులకు మద్దతు
- విశారదన్‌తో కలిసి ఆందోళన

2లో



# నిప్పుల కొలిమి

## తెలంగాణపై భానుడి ప్రతాపం

- 43 డిగ్రీలు దాటుతున్న ఉష్ణోగ్రతలు
- ఉక్కిరిబిక్కిరి అవుతున్న జనం
- ఉదయం 8 గంటలకే భానుడి సెగలు
- పలు జిల్లాలకు వాతావరణ శాఖ 'ఆరెంజ్ అలర్ట్'
- హైదరాబాద్‌లో తొలిసారి 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రలు
- రాబోయే రోజులు మరింత ప్రతాపం
- మధ్యాహ్నం వేళ ఇళ్లకే పరిమితమవుతున్న జనం
- మే నెలలో అగ్నిపరీక్షే..
- జోరందుకున్న శీతల పానీయాల వ్యాపారం

2లో

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**

భానుడు తన విశ్వరూపాన్ని ప్రదర్శిస్తుండటంతో రాష్ట్రం నిప్పుల కొలిమిని తలపిస్తోంది. గత కొద్దిరోజులుగా సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల అదనపు ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో జనజీవనం పూర్తిగా అస్తవ్యస్తమైంది. ఉదయం 8 గంటల నుంచే భానుడు సెగలు కక్కుతుండటంతో, మధ్యాహ్నం అయ్యేసరికి ప్రధాన రహదారులన్నీ జన సంచారం లేక కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు ఇప్పటికే 42 డిగ్రీల మార్కును దాటగా, రానున్న ఆరు రోజుల్లో మరింత పైగా చేరే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేస్తూ అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎండల తీవ్రతతో అల్లాడుతున్న జనం ఉపశమనం కోసం శీతల పానీయాలను ఆశ్రయిస్తుండటంతో మార్కెట్‌లో కొబ్బరి బోండాలు, పండ్ల రసాలకు విపరీతమైన డిమాండ్ పెరిగింది.

# హైదరాబాద్ నగరంలో ఎక్కడపడితే అక్కడ భూకబ్జాలు



- దోమలు, దొంగలు.. సంతోషంగా ఉన్నారు
- ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది
- కేసీఆర్‌పై అపవాదులు మోపి తప్పించుకోవాలి చూస్తున్నారు
- కాంగ్రెస్‌ను గెలిపిస్తే మళ్లీ బుల్డోజర్ రాజకీయాలు
- హైదరాబాద్ పరిస్థితులపై కేటీఆర్ తీవ్ర విమర్శలు

2లో

# మహిళా రిజర్వేషన్‌కు మద్దతు.. పునర్విభజనపై ససేమిరా

- దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తి లేదు
- ఎర్రవెల్లి నివాసంలో కేటీఆర్, హరీశ్ రావులతో కేసీఆర్ కీలక భేటీ
- ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ వేడుకల నిర్వహణపై దిశానిర్దేశం



**వేద న్యూస్, హైదరాబాద్**

భారత ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న మహిళా రిజర్వేషన్ మరియు నియోజకవర్గాల పునర్విభజన బిల్లులపై బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు తన వైఖరిని స్పష్టం చేశారు. బుధవారం ఎర్రవెల్లిలోని తన నివాసంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావులతో ఆయన సుదీర్ఘంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా దేశ, రాష్ట్ర రాజకీయ పరిణామాలతో పాటు పార్లమెంటులో ప్రవేశపెట్టబోయే బిల్లులపై క్షుణ్ణంగా చర్చించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలుపుతూనే, నియోజకవర్గాల పునర్విభజన విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలనేది బీఆర్ఎస్ పార్టీ సుదీర్ఘ కాలపు డిమాండ్ అని కేసీఆర్ గుర్తు చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలోనే అసెంబ్లీలో దీనిపై ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపామని ఆయన వివరించారు. ఈ బిల్లుకు తమ పార్టీ ఎంపీలు బేషరతుగా మద్దతు తెలుపుతారని ప్రకటించారు. మహిళా సాధికారత దిశగా

మిగతా 2వ పేజీలో



# కాంగ్రెస్ ఇప్పుడు.. ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ

- పార్టీపై హైకమాండ్ పట్టు కోల్పోయింది
- ప్రభుత్వం చెప్పినట్లే పార్టీ నడుస్తోంది
- ఎమ్మెల్యేలకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదు
- రేవంత్ ఏకపక్ష ధోరణి వల్ల పార్టీ మనుగడకే ప్రమాదం
- మాజీ మంత్రి జీవన్ రెడ్డి ధ్వజం

**వేద న్యూస్, హైదరాబాద్**

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనితీరుపై ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బుధవారం మీడియాతో మాట్లాడిన ఆయన, కాంగ్రెస్ పార్టీపై హైకమాండ్

మిగతా 2వ పేజీలో

# పరిశ్రమల పేరుతో రైతుల భూములు లాక్కోవద్దు

## బలవంతపు భూసేకరణ ఆపాలి

- 1200 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవడం దారుణం
- అందులో ఎక్కువ భాగం అసైన్డ్ భూములే
- ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేస్తోంది
- రైతుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తాం
- జాగృతి అధినేత్రి కల్వకుంట్ల కవిత
- పరిగి ఇండస్ట్రియల్ కారిడార్ రైతులకు మద్దతు
- విశారదన్‌తో కలిసి ఆందోళన

**వేద న్యూస్, వికారాబాద్**



వికారాబాద్ జిల్లా పరిగి ఇండస్ట్రియల్ కారిడార్ కోసం రైతుల భూములను నిర్బంధంగా స్వాధీనం చేసుకుంటున్నారని ఆరోపిస్తూ రైతులు ఆందోళన చేపట్టారు. ఆర్డీవో కార్యాలయం ఎదుట నడి ఎండలో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ ఆందోళనకు జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ హాజరై మద్దతు తెలిపారు. పోలీసులు ఆందోళనను అడ్డుకునే ప్రయత్నం చేయడంతో కవిత, విశారదన్‌లతో వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. పరిశ్రమల పేరుతో చిన్న, సన్నకారు రైతుల భూములను బలవంతంగా లాక్కుంటున్నారని తీవ్రంగా మండిపడ్డారు. కల్లాపూర్, రాపోల్, భట్ల చందారం వంటి గ్రామాల్లో రైతుల భూములను పూర్తిగా స్వాధీనం చేసుకుంటున్నారని ఆరోపించారు. సుమారు 1200 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుంటున్నారని, అందులో ఎక్కువ భాగం అసైన్డ్ భూములేనని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతుల భూములు కూడా ఇందులో ఉండటం దురదృష్టకరమని పేర్కొన్నారు. రైతులకు మరో మార్గం లేకుండా పరిస్థితి తీసుకువస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా రైతులు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని కవిత అన్నారు. మద్దతు ధర, రుణమాఫీ, ఎరువుల కొరత వంటి సమస్యలు పరిష్కారం కాకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. బలవంతపు భూసేకరణను నిలిపివేసే వరకు పోరాటం కొనసాగిస్తామని కవిత స్పష్టం చేశారు. రైతుల హక్కుల కోసం జాగృతి, ధర్మ సమాజ్ పార్టీ ఎప్పటికప్పుడు అండగా ఉంటాయని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ఉద్యమమే మార్గమని పిలుపునిచ్చారు.


# మహిళ ఆత్మహత్యాయత్నం.. పోలీస్ శాఖలో కలకలం..!

- తన భర్తను కస్టడీలో ఇబ్బందులు పెడుతున్నారంటూ ఆరోపణ
- ఆచూకీ కోసం వెళ్తే తనకు, తన బిడ్డను సైతం వేధింపులంటూ ఆవేదన
- పోలీసులు కారణమంటూ లెటర్ రాసి సూసైడ్ అటెంప్ట్
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు
- విచారణ చేపడుతున్న ఉన్నత అధికారులు..?

**వేద న్యూస్, వరంగల్ క్రైం**



ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ



సూసైడ్ నోట్

రాష్ట్రంలో శాంతిభద్రతలను పర్యవేక్షించాల్సిన కొందరు అధికారులు తమ విధిని విస్మరించి, ప్రలోభాలకు లోనవుతున్న తీరు వ్యవస్థకే గొడ్డలి పెట్టులా మారింది. తాజాగా వరంగల్ జిల్లాలో ఒక మహిళ తన ఆత్మహత్యాయత్నానికి పోలీసులే కారణమని వేలెత్తి చూపడం ఇప్పుడు తెలంగాణ వ్యాప్తంగా పెను సంచలనంగా మారింది. వరంగల్ దేశాయిపేటకు చెందిన బాధిత మహిళ ఉదంతం పోలీసు వ్యవస్థలోని చీకటి కోణాలను బయటపెడుతోంది. తన భర్తను పోలీసులు తీసుకెళ్లి దాదాపు 12 రోజులు గడుస్తున్నా, కనీసం ఎక్కడున్నారో చెప్పకపోగా.. తనను, తన కూతురిని మానసికంగా కుంగదీస్తున్నారని ఆమె ఆరోపించడం కలచివేస్తోంది. తన భర్త బతికి ఉన్నాడో కూడా తెలియదని మనోవేదన అనుభవిస్తోంది. మామునూరు ఏసీపీ, ఏనుమాముల సీఐ, ఎస్సై, మార్కెట్ చైర్మన్ ( ప్రస్తుతం మార్కెట్ చైర్మన్ లేరు.. సూసైడ్ నోట్ లో ఉన్న విధంగా) తన చావుకు కారణమంటూ ఆమె సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్యకు ప్రయత్నించడం తీవ్ర కలకలం రేపుతోంది. మరో వైపు బాధిత మహిళ భర్త రైతులను మోసం చేసి కోట్లలో దోచుకున్నారని ఆరోపణలు సైతం ఉన్నాయి. రైతుల ఫిర్యాదు మేరకు పోలీసులు తిరుపతి, మాధవి ఇద్దరి పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కానీ తిరుపతి ప్రస్తుతం ఎక్కడ ఉన్నాడు అనే సమాచారం మాత్రం ప్రశ్నగానే మిగిలిపోయింది. తన భర్త పోలీస్ అదుపులోనే ఉన్నారని ఇబ్బందులకు గురిచేస్తున్నారని బాధిత మహిళ మాత్రం ఆరోపిస్తున్నారు. చూడాలని మరి తిరుపతి ఎక్కడ ఉన్నారు..? పోలీస్ అదుపులో ఉన్నారా..? లేక భార్య భర్తలపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో కట్టు కథలు అల్లుతున్నారా అనేది అధికారులు అధికారికంగా తేల్చాల్సి ఉంది.

# నిప్పుల కొలిమి

- 43 డిగ్రీలు దాటుతున్న ఉష్ణోగ్రతలు
- ఉక్కిరిబిక్కిరి అవుతున్న జనం
- ఉదయం 8 గంటలకే భానుడి సెగలు
- పలు జిల్లాలకు వాతావరణ శాఖ 'ఆరెంజ్ అలర్ట్'
- హైదరాబాద్‌లో తొలిసారి 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రలు
- రాబోయే రోజులు మరింత ప్రతాపం
- మధ్యాహ్నం వేళ ఇళ్లకే పరిమితమవుతున్న జనం
- మే నెలలో అగ్నిపరీక్షే..
- జోరందుకున్న శీతల పానీయాల వ్యాపారం



**వేద న్యూస్ ప్రత్యేక ప్రతినిధి**

రాష్ట్రంలో వేసవి సెగలు ఏప్రిల్ లోనే పీక్ స్టేజ్‌కు చేరుకున్నాయి. గత కొద్దిరోజులుగా సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల అదనపు ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో రాష్ట్రం నిప్పుల కొలిమిని తలపిస్తోంది. మార్చి చివరలో ప్రారంభమైన ఈ వేడి గాలులు ఏప్రిల్ మధ్య నాటికి ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయి. ఉదయం 8 గంటలకే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తుండటంతో, మధ్యాహ్నం అయ్యేసరికి బయట అడుగు పెట్టాలంటేనే జనం వణికిపోతున్నారు. ప్రధాన రహదారులన్నీ జన సంచారం లేక కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. పగటిపూట గరిష్ఠ ఉష్ణోగ్రతలు 42 కొన్నిచోట్ల 43 డిగ్రీల మార్కును దాటడం భవిష్యత్తులో ఉండబోయే తీవ్రతకు సంకేతంగా మారుతోంది.

### రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు..

రెండ్రోజుల గణాంకాలను పరిశీలిస్తే, ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాలు ఎండల తీవ్రతకు అల్లాడిపోయాయి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో అత్యధికంగా 42.4°C నమోదు కాగా, ఆదిలాబాద్‌లో 42.3°C ఉష్ణోగ్రత రికార్డయ్యింది. ఇక్కడ కేవలం ఎండ మాత్రమే కాకుండా, పొడి గాలుల ప్రభావం ఎక్కువగా ఉండటంతో సామాన్య ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మరోవైపు ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో 41°C, ఖమ్మంలో 40.4°C చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ పెరుగుతున్న వేడి కారణంగా భూగర్భ జలాలు అడుగంటి, సాగునీటితో పాటు తాగునీటికి కూడా ఇబ్బందులు తలెత్తే పరిస్థితి కనిపిస్తోంది.

### నగరవాసులకు తప్పని సెగలు

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఈ ఏడాది తొలిసారిగా ఉష్ణోగ్రత 40°C మార్కును దాటేసింది. కాంక్రీట్ భవనాలు, వాహనాల రద్దీతో నిండిన నగరంలో వేడి తీవ్రత రెట్టింపుగా అనిపిస్తోంది. నగరంలోని ప్రధాన ప్రాంతాలైన హిమాయత్‌నగర్, ముషీరాబాద్, మెట్టుగూడలలో 40.6°C వరకు ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. బేగంపేట్, మౌలాలీ, హయత్‌నగర్ వంటి ప్రాంతాల్లో కూడా 40.5°C మేర వేడి నమోదైంది. ఐటీ కారిడార్‌తో పాటు బస్తీల్లో నివసించే ప్రజలు కూడా ఉక్కపోతతో రాత్రుళ్లు నిద్రలేని గడుపుతున్నారు. నగరంలో పెరుగుతున్న ఏసీలు, కూలర్ల వాడకం వల్ల విద్యుత్ వినియోగం కూడా రికార్డు స్థాయికి చేరుతోంది.

### జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ హెచ్చరిక

రానున్న ఆరు రోజుల పాటు పరిస్థితి ఇంకా తీవ్రంగా ఉండబోతోందని వాతావరణ శాఖ హెచ్చరించింది. పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేస్తూ అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. ముఖ్యంగా ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, ఖమ్మం వంటి జిల్లాల్లో వడగాల్పుల ప్రభావం అధికంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. రానున్న రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరిగి, ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలకు పైగా చేరుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ సమయంలో వీచే వేడి గాలుల వల్ల వడదెబ్బ తగిలే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని, కాబట్టి ప్రయాణాల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

### చిన్నారులు, వృద్ధులపై ప్రభావం

ఎండల తీవ్రతకు ఎక్కువగా ప్రభావితం అవుతున్నది చిన్నపిల్లలు, వృద్ధులే. తీవ్రమైన ఎండల వల్ల పాఠశాలలకు వెళ్లే పిల్లలు త్వరగా అలసిపోతున్నారు. చాలామంది చిన్నారులు డీహైడ్రేషన్ బారిన పడుతుండటంతో ఆసుపత్రుల వద్ద రద్దీ పెరుగుతోంది. వృద్ధుల్లో శ్వాసకోశ సమస్యలు, రక్తపోటు హెచ్చుతగ్గులు వంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వైద్యులు చెపుతున్న ప్రకారం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకూడదు. ఒకవేళ బయటకు వెళ్లాల్సి వచ్చినా తలకు టోపీ లేదా గొడుగు ధరించడం, తగినంత నీరు వెంట తీసుకెళ్లడం తప్పనిసరి.

### ఆహారం, ఆరోగ్యం విషయంలో అప్రమత్తత

ఈ వేసవి గండం నుంచి గట్టెక్కడానికి వైద్య నిపుణులు పలు సూచనలు చేస్తున్నారు. శరీరంలోని నీటి శాతం తగ్గకుండా చూసుకోవడమే వడదెబ్బ నుంచి రక్షణ పొందే మార్గమని వారు స్పష్టం చేస్తున్నారు. దాహం వేసినా వేయకపోయినా ప్రతి గంటకు నీరు తాగాలని సూచిస్తున్నారు. ఓఆర్ఎస్, మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరి నీళ్లు వంటివి ఆహారంలో భాగంగా చేసుకోవాలని చెబుతున్నారు. వదులుగా ఉండే కాటన్ దుస్తులనే ధరించాలని సూచిస్తున్నారు. మాంసాహారం, వేపుళ్లు మరియు మసాలా వస్తువులకు దూరంగా ఉండి, నీటి శాతం ఎక్కువగా ఉండే పుచ్చకాయ, దోసకాయ వంటి పండ్లను తీసుకోవాలి పేర్కొంటున్నారు.

### జోరందుకున్న 'చల్లని' వ్యాపారాలు

ఎండల తీవ్రత వ్యాపారులకు మాత్రం కాసుల వర్షం కురిపిస్తోంది. రహదారుల వెంట కొబ్బరి బోండాలు, చెరకు రసం, ఐస్ క్రీం బండ్లు క్యూ కడుతున్నాయి. ఒక కొబ్బరిబోండాం ధర ప్రాంతాన్ని బట్టి రూ. 40 నుంచి రూ. 60 వరకు ఉన్నప్పటికీ, ఆరోగ్యం కోసం జనం వెనుకాడటం లేదు. కూల్ డ్రింక్స్ కంటే సహజ సిద్ధమైన పానీయాల వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారు. మట్టి కుండల విక్రయాలు కూడా ముమ్మరంగా సాగుతున్నాయి. గ్రామాల్లో రాగి అంబలి విక్రయ కేంద్రాలు వెలుస్తున్నాయి. ఎండ నుంచి ఉపశమనం కోసం జనం పార్కులు, ఏసీ మాల్స్ వంటి చల్లని ప్రదేశాలను ఆశ్రయిస్తున్నారు.

# కాంగ్రెస్ ఇప్పుడు.. ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ

మొదటి పేజీ తరువాయి

పట్టు కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డికి సంబంధించిన ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా మారిపోయిందని ఆయన ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న ఏకపక్ష ధోరణి వల్ల పార్టీ మనుగడకే ప్రమాదం ఏర్పడిందని ఆయన హెచ్చరించారు. పార్టీలో ప్రజాస్వామ్యం కరువైందని, కనీసం ఎమ్మెల్యేలకు కూడా ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ లభించడం లేదని జీవన్ రెడ్డి ఆరోపించారు. సాధారణంగా పార్టీ తీసుకునే విధానపరమైన నిర్ణయాల మేరకు ప్రభుత్వం నడుస్తుందని, కానీ ఇప్పుడు పరిస్థితి తలకిందులైందని ఆయన విమర్శించారు. ప్రభుత్వం చెప్పినట్లుగా పార్టీ నడుస్తోందని, రేవంత్ రెడ్డి నిర్ణయాల వల్ల కాంగ్రెస్ పార్టీ అస్తిత్వం దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. సీనియర్ నాయకులను గౌరవించడం లేదని, పార్టీని రేవంత్ రెడ్డి క్రమంగా ఖతం చేస్తున్నారని ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గురించి జీవన్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ తన వయసును గౌరవించి ఎప్పుడూ అన్న అని పిలుస్తారని గుర్తు చేసుకున్నారు. కేసీఆర్‌కు ప్రజలంటే అపారమైన గౌరవం ఉందని, ఆయన వ్యక్తిత్వం రేవంత్ రెడ్డి లాంటిది కాదని ప్రశంసించారు. కేసీఆర్ హయాంలో కనీసం సంప్రదింపులకు అవకాశం ఉండేదని, ఇప్పుడు అటువంటి పరిస్థితి లేదని ఆయన అభిప్రాయపడ్డారు. రాజకీయాలకు అతీతంగా కేసీఆర్ ఇచ్చే గౌరవం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. తాను బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు వస్తున్న వార్తలపై కూడా జీవన్ రెడ్డి స్పష్టత ఇచ్చారు. తాను ఏ పార్టీలో ఉన్నా ఆఖరి వరకు ప్రజల కోసమే పోరాడతానని స్పష్టం చేశారు. పార్టీ మారుతున్నారా లేదా అనే విషయంపై సూటిగా సమాధానం చెప్పకపోయినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల పట్ల తాను తీవ్ర అసంతృప్తితో ఉన్నానని ఆయన మాటలను బట్టి తెలుస్తోంది. ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రథమ ప్రాధాన్యతని, పదవుల కోసం పాకులాడబోనని ఆయన వెల్లడించారు. జీవన్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు తెలంగాణ రాజకీయ వర్గాల్లో పెద్ద దుమారాన్ని రేపుతున్నాయి. ముఖ్యంగా సొంత పార్టీ ముఖ్యమంత్రిపైనే సీనియర్ నాయకుడు బహిరంగంగా విమర్శలు చేయడం కాంగ్రెస్ శ్రేణులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. రానున్న రోజుల్లో పార్టీ అధిష్టానం ఈ విషయంలో జోక్యం చేసుకుంటుందా లేదా అనేది వేచి చూడాలి. జీవన్ రెడ్డి వ్యాఖ్యలపై రేవంత్ రెడ్డి వర్గం ఎలా స్పందిస్తుందనేది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# మహిళా రిజర్వేషన్‌కు మద్దతు.. పునర్విభజనపై ససేమిరా

మొదటి పేజీ తరువాయి

ఇది ఒక గొప్ప అడుగు అని అభివర్ణించిన ఆయన, సామాజిక న్యాయం పాటించే ఏ బిల్లుకైనా బీఆర్ఎస్ ఎప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. అయితే, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లుపై కేసీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపదికన సీట్ల కేటాయింపు జరిగితే, జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం లోక్ సభలో దక్షిణాది రాష్ట్రాలకు ఉన్న 24 శాతం ప్రాతినిధ్యం ఏమాత్రం తగ్గకూడదని డిమాండ్ చేశారు. అభివృద్ధిలో దూసుకుపోతున్న తెలంగాణ వంటి రాష్ట్రాలకు సీట్లు పెరగాల్సిన చోట, జనాభా లెక్కల పేరుతో అన్యాయం చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆయన అభిప్రాయపడ్డారు. బిల్లులోని ప్రతి క్లాజును క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే నియోజకవర్గాల పునర్విభజనపై పార్టీ తుది నిర్ణయం తీసుకుంటుందని కేసీఆర్ నేతలకు సూచించారు. అప్పటి వరకు తొందరపాటు వ్యాఖ్యలు చేయవద్దని కోరారు. దక్షిణాది రాష్ట్రాల ఎంపీలు, నాయకులతో ఈ విషయంలో సమన్వయం చేసుకుని ఉమ్మడి పోరాటం చేసే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఉత్తరాది రాష్ట్రాలకు లాభం చేకూర్చేలా, దక్షిణాదిని వెనుకబాటుకు గురిచేసేలా ఏ నిర్ణయం ఉన్నా పార్లమెంటులో అడ్డుకుంటామని ఆయన స్పష్టం చేశారు. పార్టీ భవిష్యత్ కార్యక్రమాలపై కూడా కేసీఆర్ ఈ భేటీలో దిశానిర్దేశం చేశారు. ఈ నెల 20న జగిత్యాలలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కేటీఆర్, హరీశ్ రావులను కోరారు. అలాగే ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. మండుతున్న ఎండల దృష్ట్యా సభలకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని, గ్రామ స్థాయి నుండి పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆయన సూచించారు. ఈ భేటీతో బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.

# హైదరాబాద్ నగరంలో ఎక్కడపడితే అక్కడ భూకబ్జాలు

**వేద న్యూస్, హైదరాబాద్**

హైదరాబాద్‌లో ప్రస్తుత పరిస్థితులపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. నగరంలో ప్రస్తుతం సంతోషంగా ఉన్న వారు ఇద్దరే ఉన్నారని, ఒకరు దొంగలు, మరొకరు దోమలని ఘాటుగా వ్యాఖ్యానించారు.నగరంలో ఎక్కడపడితే అక్కడ భూములు కబ్జాలు జరుగుతున్నాయని కేటీఆర్ ఆరోపించారు. ఒకవైపు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మరోవైపు ముఖ్యమంత్రి పాలనలో ఈ పరిస్థితులు ఏర్పడ్డాయని విమర్శించారు. నగరంలో దోమల సమస్య కూడా అధికంగా ఉందని పేర్కొన్నారు. దోమల సమస్యపై అసెంబ్లీలో కూడా ప్రస్తావించానని, నగరానికి 'దోమలబాదు' లేదా 'దోమలగూడ' అనే పేర్లు పెట్టాలని చెప్పినట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్పై అపవాదులు మోపి తప్పించుకోవాలని ప్రస్తుత ముఖ్యమంత్రి ప్రయత్నిస్తున్నారని కేటీఆర్ అన్నారు. కానీ ప్రజలు నిజాన్ని తెలుసుకుంటారని, ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఉప్పల్ ఫ్లైఓవర్ పనులపై కూడా కేటీఆర్ విమర్శలు చేశారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రాజెక్ట్ ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్నప్పటికీ పురోగతి లేదని తెలిపారు. తాము నిర్మించేందుకు సిద్ధమని చెప్పినా ప్రభుత్వం అంగీకరించలేదని ఆరోపించారు. ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలని ప్రజలను కేటీఆర్ కోరారు.

## రూ. 50 వేలు లంచం తీసుకుంటూ..

**వేద న్యూస్,హుజూరాబాద్**

మున్సిపాలిటీలో అవినీతి చేప ఏసీబీ వలకు చిక్కింది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ )గా పని చేస్తున్న నుసం సుధాకర్ రెడ్డి బుధవారం ఓ కాంట్రాక్టర్ వద్ద నుంచి రూ. 50,000 లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన స్టార్మ్ వాటర్ డ్రెయిన్ (వరద నీటి కాలువ) పనులకు సంబంధించి ఫైనల్ బిల్లును ప్రాసెస్ చేసేందుకు, అలాగే మెజర్మెంట్ బుక్ (ఎం –బుక్స్ లో వివరాలు నమోదు చేసేందుకు ఏఈ సుధాకర్ రెడ్డి కాంట్రాక్టర్ నుంచి లంచం డిమాండ్ చేశారు. దీనిపై సదరు కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. బుధవారం హుజూరాబాద్‌లోని ఆర్టీసీ డిపో చౌరస్తా వద్ద బాధితుడి నుంచి రూ. 50,000 నగదు తీసుకుంటుండగా, కరీంనగర్ ఏసీబీ యూనిట్ అధికారులు మెరుపు దాడి చేసి సుధాకర్ రెడ్డిని పట్టుకున్నారు. ఆయన వద్ద నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి, కరీంనగర్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే వెంటనే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064 కు లేదా వాట్సాప్ నంబర్ 9440446106 కు ఫిర్యాదు చేయాలని అధికారులు కోరారు.

# ఇంటర్ రిజల్ట్స్ లో మెరిసిన లక్కీ

**- విద్యా కుసుమానికి అభినందనల వెల్లువ**



**వేద న్యూస్, ఎల్కతుర్తి:**

తాజాగా విడుదలైన ఇంటర్ ఫలితాలలో మెరిసిన విద్యా కుసుమం హింగే లక్కీకి అభినందనలు వెల్లువెత్తాయి. ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీ గ్రూపులో 470 మార్కులకు గాను 464 మార్కులు సాధించిన హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామానికి చెందిన హింగే భాస్కర్ కూతురు హింగే లక్కీని తెలంగాణ రాష్ట్ర ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ డీలర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగూర్ల వెంకన్న అభినందించారు.లక్కీని శాలువాతో సత్కరించి.. పూల బొకే అందజేసి దీవించారు. భవిష్యత్తులో మరింతగా రాణించి ఉన్నత స్థానాలకు వెళ్లాలని శుభాశీస్సులు అందజేశారు. విద్యలో రాణించి తనతో పాటు కళాశాలకూ పేరు సంపాదించి పెట్టిన లక్కీకి గౌతమ్ కాలేజీ డైరెక్టర్ అంబీరు శ్రీకాంత్ శుభాకాంక్షలు తెలిపారు. చక్కటి విద్యను అందిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్న గౌతమ్ కాలేజీ యాజమాన్యాన్ని నాగూర్ల వెంకన్న అభినందించారు. మోటె చిరంజీవి, టెంకు రాల శ్రీధర్, రమేష్ తదితరులు లక్కీకి శుభాకాంక్షలు తెలిపారు.

# నూతన తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో ఎండీ షరీఫ్ మొయినోద్దీన్ బుధవారం నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందించి ఘనంగా స్వాగతం పలికారు.



# ‘దళిత రత్న’ గ్రహీతకు సన్మానం

**- స్తంభంపల్లిలో అభినందనల వెల్లువ**

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం స్తంభంపల్లి గ్రామానికి చెందిన అక్కెనపల్లి కరుణాకర్ దళిత, బహుజన, తెలంగాణ ప్రజా ఉద్యమాల్లో చేసిన సేవలకు గాను హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో “దళిత రత్న” అవార్డు అందుకున్నారు. అవార్డు అందుకున్న సందర్భంగా గ్రామంలో బుధవారం ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ అశోక్ గౌడ్, ఉప సర్పంచ్ చంద్రగిరి అశోక్, మాజీ సర్పంచ్ బీరవెల్లి వెంకటేశ్వరరావు తదితరులు ఆయనను శాలువాలతో సన్మానించి అభినందించారు. అలాగే వార్డు సభ్యులు, గ్రామ ప్రముఖులు, నాయకులు పాల్గొని కరుణాకర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కరుణాకర్ తనను సన్మానించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

# పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేయాలి

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశాలు - ఎస్సీ కార్పొరేషన్ యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష**



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను నిబంధనలకు అనుగుణంగా ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ సమావేశంలో ఆమె అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఎస్సీ యాక్షన్ ప్లాన్ 2025-26కు సంబంధించిన లక్ష్యాలను మండలవారీగా ప్రవేశపెట్టి కమిటీ ఆమోదం పొందారు. అలాగే లబ్ధిదారుల ఎంపిక కోసం మండల స్థాయి ఎంపిక కమిటీలను ఏర్పాటు చేశారు. వ్యవసాయం (సోలార్ పంపులు), పశుపోషణ (రెండు పాడి పశువులు), రవాణా రంగంలో ఈవీ త్రీ వీలర్స్ (గూడ్స్, ప్యాసింజర్), ఈవీ టూ వీలర్స్ వంటి పథకాలు సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు. లక్ష్యాల కేటాయింపు, లబ్ధిదారుల ఎంపిక నిర్ణీత సమయంలో పారదర్శకంగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, జిల్లా పరిశ్రమల జీఎం హనుమంతు, పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, రవాణా అధికారి లక్ష్మణ్ కుమార్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

# తనుగులవాసి అంబాల సదానందంకు దళిత రత్న అవార్డు

**- అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రదానం**
**- ఉద్యమకారునికి దక్కిన అరుదైన గౌరవం**

**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట మండల పరిధిలోని తనుగుల గ్రామానికి చెందిన ఉద్యమకారుడు అంబాల సదానందంకు అరుదైన గౌరవం దక్కింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన ఉద్యమంలో “ధూమ్ ధామ్“ తో పాటు ఇతర సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ సందర్భంలో తెలంగాణ సంస్కృతికి ప్రతీకైన బోనమెత్తుకొని.. తనకున్న కళతో ప్రజల మనస్సును సదానందం గెలుచుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో ఎన్నో వేదికలపై వందలాది కార్యక్రమాలలో బోనమెత్తుకొని నాడు ఉద్యమాన్ని కీలక దశలోకి తీసుకెళ్లడంలో తెలంగాణ ఉద్యమకారుడిగా తనదైన కీలకపాత్రను సదానందం పోషించారు. రాష్ట్రం ఏర్పడిన ఇన్నాళ్ల తర్వాత రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రస్తుత ప్రజాపాలనలో గుర్తింపు లభించింది. మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రవీంద్ర భారతి ఆడిటోరియంలో తెలంగాణ ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన అంబాల సదానందం కు ఉత్సవ కమిటీ ఉపాధక్షులు బైరి వెంకటేష్ చేతుల మీదుగా దళిత రత్న అవార్డు అందజేశారు. ఈ సందర్భం గా అంబాల సదానందం మాట్లాడుతూ.. దళిత రత్న అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని, హర్షం వ్యక్తం చేస్తూ.. ఈ కార్య క్రమం నిర్వహించిన



రాష్ట్ర ప్రభుత్వానికి, 135వ అంబేద్కర్ ఉత్సవ కమిటీ చైర్మన్, ఎస్సి, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఉత్సవ కమిటీ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో దళిత రాష్ట్ర నాయ కులు బత్తుల పాండు, రజనీకాంత్, జక్కె రాజేష్, అనిల్ సందీప్, అంబేద్కర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# బోయినిపల్లిలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం



**వేద న్యూస్, బోయినిపల్లి:**

**- జగిత్యాల సభను విజయవంతం చేయాలని పిలుపు**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం మినీ హాల్ నటరాజ్ ఏసీ భవనంలో నిర్వహించారు. మండల నాయకులు కత్తెరపాక కొండయ్య, అధ్యక్షుడు గుంటి శంకర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ఇంచార్జ్ పెద్ది సుదర్శన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సుంకె రవిశంకర్ మాట్లాడుతూ.. ఈ నెల 20న జగిత్యాలలో నిర్వహించే కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి భారీగా కార్యకర్తలు తరలివచ్చేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తోందని విమర్శించారు. జగిత్యాల సభ కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటానికి వేదిక అవుతుందని తెలిపారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్‌లో చేరికలు పెరుగుతాయని, కార్యకర్తలు పెద్ద ఎత్తున సభకు తరలివచ్చాలని పిలుపునిచ్చారు.

# మేడే విజయవంతం చేయాలి

**- కార్మికులకు సీఐటీయూ పిలుపు**
**- కొత్తపేటలో కరపత్రం విడుదల**

**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కొత్తపేట గ్రామంలో హమాలి కార్మికుల ఆధ్వర్యంలో మే 1న జరగనున్న ప్రపంచ కార్మిక దినోత్సవం (మేడే) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కరపత్రాన్ని విడుదల చేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి గురిజాల శ్రీధర్ మాట్లాడుతూ.. కార్మిక వర్గం హక్కుల కోసం జరిగిన పోరాటాల ఫలితంగా నేడు కొన్ని హక్కులు సాధ్యమయ్యాయని తెలిపారు. ఆ పోరాటాల్లో ప్రాణత్యాగం చేసిన అమరులను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం మే 1న మేడే జరుపుకుంటామని అన్నారు. మండల కేంద్రంలో జరిగే మేడే కార్యక్రమానికి అన్ని రంగాల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని



పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. మే 1న జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నందున ప్రజాప్రతినిధులు, వ్యాపారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హమాలి సంఘం అధ్యక్షుడు సండే సారపు శ్రీనివాస్, బోనాల నాగరాజు, బోనాల ప్రశాంత్, కశిరాం, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం



**వేద న్యూస్, నల్లబెల్లి:**

**- హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి**
**- ఎస్సై గోవర్ధన్**
**- నల్లబెల్లిలో అవగాహన కార్యక్రమం**

ప్రజలు ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంచుకొని తప్పనిసరిగా పాటించాలని ఎస్సై గోవర్ధన్ సూచించారు. నల్లబెల్లి మండల కేంద్రంలో ‘ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక’లో భాగంగా పోలీసుల ఆధ్వర్యంలో ‘అరైవ్ లైవ్’ కార్యక్రమం నిర్వహించి గ్రామస్తులు, విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల్లో ప్రతిరోజూ అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని, ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటిస్తే ప్రమాదాలను తగ్గించవచ్చని అన్నారు. వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రయాణించాలని సూచించారు. బస్టాండ్ ఆవరణలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తూ తమ తల్లిదండ్రులకు కూడా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ అనురాధ, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వివాహేతర సంబంధంతో ఇద్దరు ఆత్మహత్య

**వేద న్యూస్ నారాయణపేట :**





వారిద్దరికీ వేరొకరితో పెళ్లిళ్లు అయ్యాయి. పిల్లలున్నారు. కాని వివాహేతర సంబంధం పెట్టుకుని ఇద్దరు ఆత్మహత్య చేసుకున్న ఘటన నారాయణ పేట జిల్లాలో కలకలం రేపింది. జిల్లాలోని మరికల్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన ప్రవీణ్, అరుణ అలియాస్ శ్రావణి చిన్నచింతకుంట మండలం కురుమూర్తి గ్రామంలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు.వివాహేతర సంబంధం తోనే వారు మృతి చెందినట్లు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ప్రవీణ్‌కు భార్య తో పాటు కుమారుడు ఉండగా, అరుణకు భర్తతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

వేద న్యూస్

గురువారం ఏప్రిల్ 16, 2026

# హామీ ఇచ్చారు.. కొనుగోళ్లు మరిచారు

- మొక్కజొన్న కొనుగోళ్ల నిలిపివేతపై రైతుల ఆగ్రహం
- హైవేపై రాస్తారోకో..
- కొనుగోళ్లు పునఃప్రారంభించాలని డిమాండ్
- అధికారుల హామీతో నిరసన విరమణ



**వేద న్యూస్, నల్లబెల్లి:**

మొక్కజొన్న కొనుగోళ్లు నిలిపివేయడంతో నల్లబెల్లి మండల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ శనిగరం క్రాస్ వద్ద హైవేపై రాస్తారోకో నిర్వహించారు. కొనుగోళ్లు వెంటనే పునఃప్రారంభించి వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రం ప్రారంభంలో ఆశలు కలిగించినా, ప్రస్తుతం రైతులకు ఆవేదనగా మారింది. కనీస మద్దతు ధర రూ.2400 ప్రకటించినప్పటికీ ఆ ధరకు పంట అమ్ముకునే పరిస్థితి లేదని రైతులు తెలిపారు. పదిహేను రోజులు గడిచినా కేవలం రెండు లారీలు మాత్రమే కొనుగోలు చేయగా, మిగిలిన పంట కేంద్రం వద్ద పేరుకు పోయిందన్నారు. అధికారులు సమయానికి రాకపోవడంతో ఎండలో గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని, త్రాగునీరు, నీడ వంటి కనీస సౌకర్యాలు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాల ముప్పుతో పంట నాణ్యత దెబ్బతింటుందని భయపడుతున్నారు. ప్రారంభంలో ఇచ్చిన హామీలు అమలు కాలేదని ప్రభుత్వంపై అసంతృప్తి వ్యక్తం చేసిన రైతులు, తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాస్తారోకోతో హైవేపై ట్రాఫిక్ నిలిచిపోగా, పోలీసులు చేరుకుని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు నిరసన విరమించారు.

# ప్రైవేట్ పాఠశాల వద్దు.. ప్రభుత్వ స్కూలే ముద్దు

- ముచ్చింపుల తండాలో మనబడి కార్యక్రమానికి స్పందన



**వేద న్యూస్, నల్లబెల్లి:**

ముచ్చింపుల తండాలో నిర్వహించిన మనబడి కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మచ్చిక రవీందర్, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్ అంగోత్ రమ, గ్రామ పెద్దలు శ్రీరాములు, కోటేశ్వర్లు, అంగోత్ పూలసింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులను ఉద్దేశించి మూడు సంవత్సరాల పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి మెరుగైన విద్య అందించాలని సూచించారు. ప్రైవేట్ పాఠశాలలకన్నా ప్రభుత్వ పాఠశాలలు సమగ్ర విద్యను అందిస్తున్నాయని వివరించారు.'ప్రైవేట్ పాఠశాల వద్దు - ప్రభుత్వ పాఠశాల ముద్దు' నినాదంతో అవగాహన కల్పిస్తూ, పిల్లల భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించాలని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ములవాగు ఇసుక రీచ్‌పై ఆకస్మిక తనిఖీ

- నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి - డీఎస్పీ శ్రీనివాసులు

**వేద న్యూస్, వేములవాడ:**

వేములవాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని ములవాగు ఇసుక రీచ్‌ను డీఎస్పీ శ్రీనివాసులు పట్టణ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇసుక తవ్వకాల విధానం, రవాణా అనుమతులు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 'మన ఇసుక వాహనం' ఆన్‌లైన్ విధానం ద్వారానే ఇసుక సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. అక్రమంగా ఇసుక రవాణా చేయడం, అనధికార నిల్వలు ఉంచడం వంటి చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని డీఎస్పీ హెచ్చరించారు. ఇసుక రవాణాలో పారదర్శకత పాటిస్తూ ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు.



# గురుదక్షిణగా ఆర్థిక సహాయం

- పూర్వ విద్యార్థుల నుంచి రూ.2.10 లక్షల అందజేత
- శేఖర్ కుటుంబానికి అండగా నిలిచిన శిష్యులు

**వేద న్యూస్, చొప్పదండి**



సీనియర్ పాత్రికేయుడు, శారద విద్యాలయంలో 2006-2014 మధ్య ఉపాధ్యాయునిగా సేవలందించిన సంబోజి శేఖర్ గుండెపోటుతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించిన పూర్వ విద్యార్థులు గురుదక్షిణగా రూ. 2,10,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. తమకు జ్ఞానం మాత్రమే కాకుండా విలువలు నేర్పిన ఆదర్శ గురువు శేఖర్ అని గుర్తు చేసుకున్నారు. ఆయన అకాల మరణం తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఆయన చూపిన మార్గంలోనే ముందుకు సాగుతామని తెలిపారు. పూర్వ విద్యార్థులు ఎల్లప్పుడూ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్థిక సహాయం అందజేసిన విద్యార్థులను ఉపాధ్యాయులు జగన్మోహన్, రత్నాకర్, మల్లేశం, స్వప్న అభినందించారు.

# మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి శ్రీధర్ బాబు



**వేద న్యూస్, జయశంకర్ భూపాలపల్లి :**

హైదరాబాద్ వేదికగా జర్నలిస్టులు జాతీయస్థాయి సమావేశాలు నిర్వహించడం అభినందనీయమని ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు.జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ధన్వాడలో బుధవారం ఈ నెల 23,24 తేదీలలో నిర్వహించే నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్(ఇండియా) (ఎన్‌యూజే(ఐ)) జాతీయ సమావేశాల వాల్ పోస్టర్ ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఎన్‌యూజే(ఐ) అనుబంధ యూనియన్ అయిన తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ (టిఎస్ జెయు) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాల జర్నలిస్ట్ ప్రతినిధులు హాజరయ్యేలా,హైదరాబాద్‌లో రెండు రోజుల పాటు జాతీయ స్థాయి సెమినార్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ ప్రతిష్టాత్మక సమావేశాలకు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వడం గర్వకారణమని పేర్కొన్నారు.జర్నలిస్టుల సమస్యలపై చర్చించేందుకు ఈ వేదిక ఉపయోగపడుతుందని ఆకాంక్షిస్తూ,కార్యక్రమ నిర్వాహకులైన టీఎస్‌జేయూ రాష్ట్ర,జిల్లా కమిటీలకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టీఎస్‌జేయూ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పావుశెట్టి శ్రీనివాస్,రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తడుక సుధాకర్,జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంతోష్ ,జిల్లా ప్రధాన కార్యదర్శి దొమ్మటి రవీందర్,జిల్లా ఉపాధ్యక్షులు అరిగేల జనార్ధన్,గట్టు రవీందర్,ధన్వాడ సర్పంచ్ చీటూరి మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

- బైక్ అదుపుతప్పి మైలురాయికి ఢీ

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

ఇల్లంతకుంట మండలం గాలిపల్లి-జవారిపేట గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో గన్నేరువరం మండలం పారువెల్ల గ్రామానికి చెందిన వర్కోలు కోటి (28) మృతి చెందాడు. బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనున్న మైలురాయిని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం నెలకొంది.



# రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత



**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

వరంగల్ నగరంలోని ఉర్సు రంగాలీల మైదానం కూడలి వద్ద బుధవారం నిర్వహించిన "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. సత్య శారద ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో కలిసి మానవహారం నిర్వహించి రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు, వాహనదారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. సురక్షిత డ్రైవింగ్‌కు సంబంధించిన నియమాలు కచ్చితంగా పాటించాల్సిన అవసరాన్ని వివరించిన కలెక్టర్, ద్విచక్ర వాహనం నడిపించే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అలాగే వెనుక కూర్చునే వారు కూడా హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణ రక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, డిసిపి అంకిత్ కుమార్ చేతుల మీదుగా ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. విద్యార్థులకు కూడా హెల్మెట్లు అందజేసి, రోడ్డు భద్రతపై తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని సూచించారు. అనంతరం విద్యార్థులతో రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిసిపి అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఏసీపీ శుభం, పోలీసు, రవాణా శాఖ అధికారులు, జిల్లా అధికారులు, విద్యార్థులు, వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలి

- కోటగిరిలో అవగాహన కార్యక్రమం



**వేద న్యూస్, కోటగిరి:**

అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా కోటగిరి బస్టాండ్ వద్ద ఎస్సై సునీల్ విద్యార్థులతో మానవహారం నిర్వహించి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మద్యం సేవించి, అతివేగంతో వాహనాలు నడపకూడదని హెచ్చరించారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. సురక్షిత ప్రయాణం కుటుంబ సభ్యులకు రక్షణగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పి. అనిల్, పోలీస్ సిబ్బంది శ్రీనివాస్, నాగేంద్రబాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలి

= రుద్రూర్‌లో అవగాహన కార్యక్రమం

**వేద న్యూస్, రుద్రూర్:**

వాహనదారులు రోడ్డు భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలని ఎస్సై సాయన్న సూచించారు. అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం రుద్రూర్ బస్టాండ్ వద్ద ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లు నడిపేవారు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని పేర్కొన్నారు. మద్యం సేవించి, అతివేగంతో వాహనాలు నడపడం ప్రమాదకరమని హెచ్చరించారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని, సురక్షిత ప్రయాణం కుటుంబ సభ్యులకు రక్షణగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.



వేద న్యూస్

గురువారం ఏప్రిల్ 16, 2026

## సమీకృత మండల సముదాయ భవనం శుభ్రం

- వేద న్యూస్ కథనానికి స్పందించిన అధికారులు
- ప్రజల హర్షం.. పత్రికకు కృతజ్ఞతలు




**వేద న్యూస్, రుద్రూర్:**

మండల కేంద్రంలోని సమీకృత మండల సముదాయ భవనం పరిశుభ్రతపై వేద న్యూస్‌లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గత మూడు రోజులుగా భవనాన్ని పూర్తిగా శుభ్రం చేయించారు. 'బూజు పట్టిన సమీకృత మండల సముదాయ భవనం.. పరిశుభ్రతపై పట్టించుకోని అధికారులు' అనే శీర్షికతో వేద న్యూస్ లో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. వార్తకు స్పందించిన అధికారుల వెంటనే చర్యలు చేపట్టారు. భవనం పరిశుభ్రంగా మారడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ వేద న్యూస్ పత్రికకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## శివ పరివార విగ్రహాలు తొలగింపు.. భక్తుల ఆగ్రహం

**వేద న్యూస్, కరీంనగర్ ప్రతినిధి :**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో మరో వివాదం తలెత్తింది. అభివృద్ధి పనుల పేరుతో భీమేశ్వరాలయంలోని విగ్రహాలను తొలగించడం భక్తుల్లో తీవ్ర అసంతృప్తికి దారితీసింది. దేవస్థానానికి అనుబంధంగా ఉన్న భీమేశ్వరాలయంలో దక్షిణాముఖ హనుమంతుడిగా ప్రసిద్ధి చెందిన హనుమాన్ గుడి వద్ద ఉన్న శివ పరివార విగ్రహాలను ఇటీవల తొలగించినట్లు తెలుస్తోంది. ఈ విగ్రహాలను జ్యోతిర్లింగాల మండపం వద్ద నిర్లక్ష్యంగా ఉంచడం పట్ల భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఈ విగ్రహాలను సరైన విధంగా సంరక్షించకపోవడం, వాటిని పక్కన పెట్టడం ద్వారా భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఆలయ అభివృద్ధి పనులు చేస్తున్నప్పటికీ, ఇలాంటి చర్యలు అనుచితమని వారు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో తొలగించిన విగ్రహాలను తక్షణమే యథాస్థానంలో ప్రతిష్ఠించాలనీ, లేకపోతే ప్రత్యేకంగా ఆలయం నిర్మించి గౌరవప్రదంగా ఏర్పాటు చేయాలనీ భక్తులు డిమాండ్ చేస్తున్నారు. ఆలయంలో జరుగుతున్న నిర్లక్ష్యంపై దేవస్థాన ఈవో వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ ఘటనపై దేవస్థాన అధికారులు ఎలా స్పందిస్తారో చూడాల్సి ఉంది.



## రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ నేత మృతి

**వేద న్యూస్, ఖమ్మం:**

ఖమ్మం నగర కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షుడు, పీసీసీ సభ్యుడు మహమ్మద్ జావిద్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన అకాల మరణం కాంగ్రెస్ వర్గాల్లో విషాదాన్ని మిగిల్చింది. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "కాంగ్రెస్ పార్టీ నాయకుడిని మాత్రమే కాదు, నాకు ఎంతో ఆత్మీయుడిని కోల్పోయాను. ఈ మరణం పార్టీకి, వ్యక్తిగతంగా నాకు తీరని లోటు" అని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.



## గోవిందపూర్‌లో బడిబాట

- ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన
- తల్లిదండ్రులకు నమోదుపై పిలుపు

**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండలం గోవిందపూర్ గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారి గడ్డం బిక్షపతి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ స్వాతి శ్రావణ్ కుమార్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మాలోత్ సారయ్య నాయక్, ఉపసర్పంచ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఈనెల 6 నుంచి జూన్ 12 వరకు బడిబాట కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. బడి ఈడు పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, నోటుబుక్స్, స్కాలర్షిప్లు, రవాణా భత్యం వంటి అనేక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులచే బోధన జరుగుతుందని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరంలో మెరుగైన అల్పాహారం, సాయంత్రం స్నాక్స్ కూడా అందించనున్నట్లు తెలిపారు. తెలంగాణ ఆదర్శ పాఠశాలల ద్వారా విద్యార్థి కేంద్రీకృత విద్యను బలోపేతం చేయనున్నట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనిత, రజిత తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా ప్రపంచ కళా దినోత్సవం

**వేద న్యూస్, ఖమ్మం:**



- నేలకొండపల్లిలో వేడుకలు

ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలోని భక్త రామదాసు ప్రెస్ క్లబ్ ప్రాంగణంలో ప్రపంచ కళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డా. గుగ్గిళ్ళ దివ్యమూర్తి అభిమానుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి కళాకారుల సంఘం అధ్యక్షుడు తెల్లగొర్ల లింగ స్వామి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా దివ్యమూర్తి మాట్లాడుతూ ఇటలీ చిత్రకారుడు లియోనార్డో డావెన్సీ జయంతిని పురస్కరించుకుని 2012 నుంచి ప్రపంచ కళా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. కళ అనేది సృజనాత్మకత, ప్రతిభకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రపంచంలో 64 కళలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ తమకు ఉన్న కళలో అభివృద్ధి సాధించాలని సూచించారు. అనంతరం సంఘం సభ్యులు కేక్ కట్ చేసి వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కవి సామ్రాట్ చిలకాబత్తిని వీరబాబు, బీజేపీ నాయకుడు పాగర్తి సుధాకర్, వంగూరి ఆనందరావు, లక్ష్మణాచారి, సత్యనారాయణ, భిక్షం నాయక్, జ్ఞానరత్నం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## జావేద్ మృతిపై టీజేఎఫ్ ఖమ్మం ప్రెస్ క్లబ్ సంతాపం

- కుటుంబానికి ప్రగాఢ సానుభూతి

**వేద న్యూస్, ఖమ్మం:**

సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ఖమ్మం నగర మాజీ అధ్యక్షుడు మహ్మద్ జావేద్ సూర్యాపేట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పట్ల టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) ఖమ్మం ప్రెస్ క్లబ్ కమిటీ తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. ఒక ప్రకటనలో కమిటీ సభ్యులు మాట్లాడుతూ జావేద్ మృతి కాంగ్రెస్ పార్టీకి, ప్రజలకు తీరని లోటని తెలిపారు. ప్రజా సేవలో ఆయన చూపిన నిబద్ధత, సామాజిక కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారంలో చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. ఈ సందర్భంగా జావేద్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారికి మనోధైర్యం కలగాలని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.



## రోడ్డు భద్రత వారోత్సవాలు..

- విద్యార్థులకు అవగాహన
- బోయినిపల్లిలో పోలీసుల శ్రమదానం

**వేద న్యూస్, బోయినిపల్లి:**




బోయినిపల్లి మండల కేంద్రంలోని ఆనంద్ విద్యానికేతన్ పాఠశాలలో రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా ఎస్సై రమాకాంత్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనం నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని, డ్రంక్ అండ్ డ్రైవ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. తల్లిదండ్రులకు కూడా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు విద్యార్థులతో ఉత్తరాలు రాయించారు. అదనంగా ఎస్సై రమాకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు శ్రమదానం నిర్వహించి బోయినిపల్లి-గంగాధర ప్రధాన రహదారిలో మట్టిని తొలగించి గుంతలను పూడ్చివేశారు. వాహన ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని, తనిఖీల సమయంలో పోలీసులకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ గంగరాజు, హెడ్ కానిస్టేబుల్ కనకయ్య, కానిస్టేబుళ్లు కరీం, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యం, విద్యుత్ రంగాల అభివృద్ధికి ప్రాధాన్యం



- మంత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- కల్లూరులో ఆసుపత్రి ప్రారంభం.. ఉపకేంద్రానికి శంకుస్థాపన
- డిప్యూటీ సీఎం భట్టితో కలిసి పర్యటన

**వేద న్యూస్, ఖమ్మం:**

ప్రజల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆరోగ్యం, విద్యుత్ రంగాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. బుధవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో కలిసి కల్లూరు మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా కల్లూరులో రూ.10.50 కోట్లతో నిర్మించిన 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు. నారాయణపురంలో రూ.2.75 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన చేశారు. మంత్రి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు సమీపంలోనే నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఈ ఆసుపత్రి కీలకంగా ఉంటుందని తెలిపారు. కొత్త ఉపకేంద్రం ద్వారా పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరా మెరుగు పడుతుందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్ దత్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సొంత తమ్ముడినే చంపేసిన అన్న

**వేద న్యూస్ హైదరాబాద్ :**

హైదరాబాద్‌లోని చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. సొంత తమ్ముడినే ఓ అన్న హత్య చేశాడు. వివరాల్లోకి వెళ్తే అజంపురలోని ముస్లిం మెటర్నిటీ వెనుక భాగంలో నివాసం ఉండే హాసిం హుస్సేన్, షాఫ్దాన్ హుస్సేన్ అన్నదమ్ములు. వారి మధ్య కొంతకాలంగా విబేధాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం తెల్లవారుజామున 6.40 గంటల ప్రాంతంలో తమ్ముడు షాఫ్దాన్‌ను అన్న హాసిం హత్య చేశాడు. హత్యపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా, నిందితుడు హాసిం పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# అక్రిడిటేషన్ కమిటీని తక్షణమే రద్దు చేయాలి

- మేడ్చల్ జిల్లా అక్రిడిటేషన్ కమిటీ నియామకంలో అవకతవకలు
- డిపిఆర్ఓ పై సమాచార కమిషనర్ కు ఫిర్యాదు

**వేద న్యూస్, మేడ్చల్ :**

మేడ్చల్ జిల్లా అక్రిడిటేషన్ కమిటీలో అవకతవకలు జరిగాయని జిల్లాలోని పలువురు సీనియర్ జర్నలిస్టులు బుధవారం జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి కి ఫిర్యాదు చేశారు. సమాచార పౌర సంబంధాల శాఖ జారీ చేసిన ఉత్తర్వులకు విరుద్ధంగా జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారిని కమిటీని నియమించారని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యంగా ఒకే యూనియన్ కు పెద్దపీట వేయడంతో పాటు జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారిని తనకు అనుకూలంగా ఉన్నవారిని కమిటీలో నియమించారని సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్లినట్లు వారు పేర్కొన్నారు. జిల్లా అక్రిడిటేషన్ కమిటీ నియామకంపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ విషయంలో ఇప్పటికే సమాచార హక్కు చట్టం కింద అక్రిడిటేషన్ కమిటీ నియామకంపై పూర్తి సమాచారం ఇవ్వాలని జిల్లా పౌర సంబంధాల అధికారిని కోరినట్లు వారు తెలిపారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు వారు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నియమించిన జిల్లా అక్రిడిటేషన్ కమిటీని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

# పెద్దపల్లిలో భారీ జాబ్ మేళా ఏర్పాటు



- ఏప్రిల్ 17న టాస్క్ సెంటర్‌లో నిర్వహణ
- ప్రముఖ కంపెనీలతో ఇంటర్వ్యూలు
- నిరుద్యోగ యువతకు మంచి అవకాశం

**వేద న్యూస్ పెద్దపల్లి :**

జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 17న పెద్దపల్లి జిల్లా కేంద్రంలో భారీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. టాస్క్ రీజినల్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడనుంది. పెద్దపల్లి బస్టాండ్ సమీపంలోని టాస్క్ రీజినల్ సెంటర్‌లో ఉదయం 10 గంటల నుంచి ఈ జాబ్ డ్రైవ్ ప్రారంభం కానుంది. డిప్లొమా, ఐటీఐ, ఎంబీఏ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని అధికారులు తెలిపారు. ఈ మేళాలో ఏజే సొల్యూషన్స్, వార్కస్ ఈవీ మోటార్స్, మెగా ఇంజనీరింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ వంటి ప్రముఖ సంస్థలు పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నాయి. అర్హత ఆధారంగా ఉద్యోగాల కోసం అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు ఆసక్తి గల అభ్యర్థులు రెండు సెట్ల తాజా రెజ్యూమ్‌లతో పాటు ఫార్మల్ డ్రెస్‌లో ఇంటర్వ్యూకు హాజరు కావాలని కలెక్టర్ సూచించారు. నిర్ణీత సమయానికి ముందుగానే వేదికకు చేరుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలోని అర్హత కలిగిన యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మంచి కంపెనీల్లో ఉద్యోగాలు పొందాలని అధికారులు కోరారు. మరిన్ని వివరాల కోసం టాస్క్ రీజినల్ సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ జాబ్ మేళా ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు జిల్లాలో నిరుద్యోగ సమస్య కొంత మేర తగ్గుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

- అరైవ్‌అలైవ్‌లో భాగంగా మూడో రోజు నిర్వహణ
- హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరి: అధికారులు
- నిర్లక్ష్యమే ప్రమాదాలకు కారణమన్న హెచ్చరిక



**వేద న్యూస్ ఖమ్మం :**



రోడ్డు భద్రతపై అవగాహన పెంచేందుకు నిర్వహిస్తున్న 'అరైవ్‌అలైవ్' కార్యక్రమంలో భాగంగా ఎస్ఆర్ జూనియర్ కాలేజ్ విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీజీ సంజయ్ కుమార్ జైన్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం తప్పనిసరి అని అధికారులు పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపకూడదని, సెల్ ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని హెచ్చరించారు. అతివేగం కూడా రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. చిన్న నిర్లక్ష్యపు చర్యల వల్లనే పెద్ద ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. ఒక్క క్షణం నిర్లక్ష్యం వల్ల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితులు వస్తాయని హెచ్చరించారు. విద్యార్థులు రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో ప్రజల సహకారం అత్యంత అవసరమని పేర్కొన్నారు.

# ఆరోగ్యానికి ఉత్తమ బ్రేక్‌ఫాస్ట్ ఏది?



- ఉదయాన్నే సరైన ఆహారం శక్తికి మూలం
- ప్రోటీన్లు, ఫైబర్ ఉండే ఆహారమే ఉత్తమం
- రోజు మొత్తం ఎనర్జీకి బ్రేక్‌ఫాస్ట్ కీలకం

**వేద న్యూస్ డెస్క్:**

రోజును ఉత్సాహంగా, శక్తివంతంగా ప్రారంభించాలంటే ఉదయాన్నే తీసుకునే బ్రేక్‌ఫాస్ట్ అత్యంత ముఖ్యమైనది. రాత్రంతా ఆహారం తీసుకోకుండా ఉన్న శరీరానికి ఉదయం సరైన పోషకాలు అందకపోతే అలసట, బలహీనత, దృష్టి లోపం వంటి సమస్యలు ఎదురవుతాయి. అందుకే ఆరోగ్య నిపుణులు ఉదయపు భోజనాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ మానకూడదని సూచిస్తున్నారు. ఉదయాన్నే తీసుకునే ఆహారం శరీరానికి అవసరమైన శక్తిని మాత్రమే కాకుండా, రోజంతా పనులు సక్రమంగా చేయడానికి అవసరమైన స్థిరమైన ఎనర్జీని అందిస్తుంది. ముఖ్యంగా ప్రోటీన్లు, ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా ఉండే ఆహారాలు తీసుకోవడం ద్వారా శరీరం సమతుల్యంగా పనిచేస్తుంది. ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారం కండరాల బలాన్ని పెంచుతుంది. ఫైబర్ ఎక్కువగా ఉండే పదార్థాలు జీర్ణక్రియను మెరుగుపరచి ఎక్కువసేపు ఆకలి వేయకుండా సహాయపడతాయి. మన సంప్రదాయ బ్రేక్‌ఫాస్ట్ వంటకాలు ఆరోగ్యపరంగా ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ఇడ్లీసాంబార్ తేలికగా జీర్ణమవుతూ శరీరానికి శక్తినిస్తుంది. ఉప్మా, పేసరట్టు వంటి వంటకాలు ప్రోటీన్, ఫైబర్ కలిగినవిగా ఉండి ఉదయం ఆహారానికి ఉత్తమ ఎంపికగా నిలుస్తాయి. అలాగే దోశలు, పొంగల్, రాగి జావ వంటి పదార్థాలు కూడా శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తాయి. ఇవి మాత్రమే కాకుండా, ఆధునిక జీవనశైలిలో ఓట్స్, గోధుమ రవ్వతో చేసిన వంటకాలు, పండ్లు, గుడ్లు వంటి ఆహారాలు కూడా మంచి ఎంపికలు. పండ్లలో ఉండే సహజ చక్కెరలు శరీరానికి తక్షణ శక్తిని ఇస్తాయి. గుడ్లు ప్రోటీన్‌కు మంచి మూలం. పాలు, పెరుగు తీసుకోవడం వల్ల కాల్షియం, విటమిన్లు అందుతాయి. అయితే ప్రస్తుతం వేగవంతమైన జీవనశైలిలో చాలా మంది బ్రేక్‌ఫాస్ట్‌ను నిర్లక్ష్యం చేస్తున్నారు. ఫాస్ట్ ఫుడ్ లేదా జంక్ ఫుడ్‌పై ఆధారపడటం పెరుగుతోంది. ఇది ఆరోగ్యానికి హానికరం. ఉదయం ఆహారం మానేయడం వల్ల బరువు పెరగడం, గ్యాస్ సమస్యలు, అలసట, ఏకాగ్రత లోపం వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. అంతేకాకుండా దీర్ఘకాలంలో మధుమేహం, గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం కూడా పెరుగుతుంది. కాబట్టి ప్రతిరోజూ ఒకే సమయానికి బ్రేక్‌ఫాస్ట్ తీసుకోవడం అలవాటు చేసుకోవాలి. ఎక్కువ నూనె, మసాలా పదార్థాలు తగ్గించి, సహజమైన ఆహారాన్ని ఎంచుకోవాలి. తక్కువగా అయినా సరే పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవడం ముఖ్యము. ఉదయం సరైన ఆహారం తీసుకుంటే శరీరం మాత్రమే కాదు, మనసు కూడా ఉల్లాసంగా ఉంటుంది. మొత్తానికి ఆరోగ్యకరమైన జీవనశైలికి మొదటి మెట్టు సరైన బ్రేక్‌ఫాస్ట్. ప్రతి రోజు మంచి ఆహారంతో రోజును ప్రారంభిస్తే ఆరోగ్యం, ఉత్సాహం, శక్తి మీతోనే ఉంటాయి.

# వేసవిలో పిల్లలకు నీటి అవసరం ఎంత?

- వయస్సు, వాతావరణం ఆధారంగా మారే అవసరం
- నీళ్లు తాగకపోతే వచ్చే సమస్యలు
- సహజ పానీయాలే ఉత్తమం



**వేద న్యూస్ డెస్క్:**

వేసవి కాలంలో పిల్లల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే తగినంత నీరు తీసుకోవడం అత్యంత కీలకం. అయితే ప్రతి పిల్లవాడికి ఒకే మోతాదులో నీళ్లు అవసరం అని చెప్పలేమని వైద్యులు చెబుతున్నారు. వయస్సు, వాతావరణం, శారీరక చురుకుదనం, చెమట వంటి అంశాలపై నీటి అవసరం ఆధారపడి ఉంటుంది. సాధారణంగా ఒకటి నుంచి నాలుగేళ్ల పిల్లలు రోజుకు సుమారు ఒక లీటరు నీళ్లు తాగాలి. అయిదు నుంచి తొమ్మిదేళ్ల పిల్లలు ఒకటిన్నర లీటర్లు, తొమ్మిది నుంచి పద్నాలుగేళ్ల పిల్లలు సుమారు రెండు లీటర్ల వరకు నీరు తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు. అయితే ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు లేదా ఎక్కువగా ఆటలు ఆడినప్పుడు మరింత నీరు అవసరం అవుతుంది. కొంతమంది పిల్లలు నీళ్లు తాగడానికి ఇష్టపడకపోవడంతో మార్కెట్లో లభించే పానీయాలు ఇస్తున్నారు. కానీ వాటిలో అధిక చక్కెర, రసాయనాలు ఉండటంతో ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. దంత సమస్యలు, అధిక బరువు వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. అందుకే ఇంట్లో తయారు చేసిన పండ్ల రసాలు ఇవ్వడం ఉత్తమం. పిల్లలు తరచుగా దాహం తెలియజేయకపోవచ్చు. కాబట్టి తల్లిదండ్రులు సమయానికి నీళ్లు తాగించే అలవాటు చేయాలి. పుచ్చకాయ, ఖర్బూజ, నారింజ వంటి నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లు ఇవ్వడం ద్వారా శరీరానికి తేమ అందుతుంది. వేసవిలో సరైన జాగ్రత్తలు తీసుకుంటే పిల్లల ఆరోగ్యాన్ని సురక్షితంగా కాపాడుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

# కోసిన పండ్లు ఆరోగ్యానికి ముప్పు

**వేద న్యూస్ డెస్క్:**




వేసవి కాలం రాగానే చల్లని పండ్లకు డిమాండ్ భారీగా పెరుగుతుంది. దాహం తీర్చడంలో, శరీరానికి తక్షణ శక్తి అందించడంలో పండ్లు కీలక పాత్ర పోషిస్తాయి. అయితే తాజాగా కోయకుండా ముందుగానే కోసి నిల్వ ఉంచిన పండ్లు ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పు కలిగిస్తాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రత్యేకంగా వీధుల్లో లేదా దుకాణాల్లో కోసి పెట్టే పండ్ల విషయంలో జాగ్రత్తలు తీసుకోకపోతే అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. పండును కోసిన వెంటనే అది గాలితో సంపర్కంలోకి వచ్చి ఆక్సీకరణం అనే ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఈ ప్రక్రియ వల్ల పండ్లలో ఉండే ముఖ్యమైన పోషకాలు, ముఖ్యంగా విటమిన్ సి వంటి అంశాలు వేగంగా తగ్గిపోతాయి. అందుకే ఆపిల్, అరటి వంటి పండ్లు కోసిన కొద్దిసేపటికే గోధుమరంగులోకి మారిపోతాయి. ఇది కేవలం రంగు మార్పే కాకుండా, పోషక విలువలు తగ్గిపోతున్న సంకేతం కూడా. వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతలు, తేమ కారణంగా కోసిన పండ్లలో బ్యాక్టీరియా పెరుగుదల మరింత వేగంగా జరుగుతుంది. గది ఉష్ణోగ్రతలో కొద్దిసేపు ఉంచినా సూక్ష్మక్రిములు వేగంగా పెరిగి పండ్లను కలుషితం చేస్తాయి. ముఖ్యంగా ఒక గంటకు పైగా బయట ఉంచిన పండ్లను తినడం వల్ల వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి వంటి ఫుడ్ పాయిజనింగ్ లక్షణాలు కనిపించే అవకాశం ఉంది. ఇంకా వీధుల్లో అమ్మే కోసిన పండ్లపై ఈగలు, దుమ్ము, కాలుష్యం ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఈ పరిస్థితుల్లో టైఫాయిడ్, కాలరా వంటి అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం కూడా పెరుగుతుంది. పండ్లు కోయడానికి ఉపయోగించే కత్తులు, బోర్డులు శుభ్రంగా లేకపోతే మరింత ప్రమాదం ఏర్పడుతుంది. ఫ్రిజ్‌లో ఉంచిన కోసిన పండ్లు సురక్షితం అనుకోవడం కూడా పూర్తిగా సరైనది కాదు. ఫ్రిజ్‌లో నిల్వ ఉంచినా కొన్ని గంటల తర్వాత వాటి తాజాదనం తగ్గిపోతుంది. పైగా సరైన విధంగా మూతపెట్టకపోతే ఇతర ఆహారాల వాసనలు, బ్యాక్టీరియా కూడా వాటిలోకి చేరే ప్రమాదం ఉంది. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే పండ్లను తినే ముందు మాత్రమే కోయడం ఉత్తమం. తాజాగా కోసిన పండ్లు మాత్రమే శరీరానికి పూర్తి పోషకాలను అందిస్తాయి. బయట కోసి అమ్మే పండ్లను వీలైనంత వరకు దూరంగా ఉంచడం మంచిది. అవసరమైతే ఇంట్లోనే శుభ్రంగా కడిగి, గాలి చొరబడని పాత్రలో తక్కువ సమయం పాటు నిల్వ ఉంచి వెంటనే తినాలి. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు వంటి వారు కోసిన పండ్ల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. శుభ్రత, తాజాదనం పాటించడం ద్వారా అనేక అనారోగ్య సమస్యలను సులభంగా నివారించవచ్చు. మొత్తానికి పండ్లు ఆరోగ్యానికి మంచివే కానీ, అవి ఎలా తీసుకుంటామన్నది మరింత ముఖ్యము. తాజాగా కోసిన పండ్లను మాత్రమే తీసుకోవడం ద్వారా వేసవిలో ఆరోగ్యంగా ఉండవచ్చు.

# లేఆఫ్స్ ప్రభావం.. మిగిలిన వారిపై ఒత్తిడి?

**వేద న్యూస్ డెస్క్:**

ప్రస్తుత ప్రపంచ కార్పొరేట్ రంగంలో ఖర్చుల నియంత్రణ, సంస్థాగత పునర్నిర్మాణం పేరుతో జరుగుతున్న లేఆఫ్స్ సాధారణ ప్రక్రియగా మారిపోయాయి. అయితే ఈ ప్రభావం కేవలం ఉద్యోగం కోల్పోయిన వారికే పరిమితం కాకుండా, సంస్థలో కొనసాగుతున్న ఉద్యోగులపై కూడా తీవ్రంగా పడుతోందని పలు అధ్యయనాలు సూచిస్తున్నాయి. ప్రత్యేకంగా సైన్స్ డైరెక్ట్ వంటి నివేదికల ప్రకారం, పదే పదే జరిగే ఉద్యోగాల కోతల వల్ల మిగిలిన సిబ్బందిలో తీవ్రమైన అభద్రతా భావం పెరుగుతోంది. ఎంత కష్టపడి పని చేసినా రేపు తమ ఉద్యోగం సురక్షితం కాదేమో అన్న అనుమానం వారిని నిరంతరం వెంటాడుతోంది. ఈ పరిస్థితి మానసిక ఒత్తిడిని పెంచుతూ, వారి పనితీరు, సృజనాత్మకతపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. ఈ ఒత్తిడి కేవలం సాధారణ ఉద్యోగులకే కాకుండా, మేనేజర్ స్థాయి ఉద్యోగులకు కూడా వర్తిస్తోంది. సంస్థ లక్ష్యాలను చేరుకోవాలనే ఒత్తిడిలో వారు ఉద్యోగుల సంక్షేమం కంటే తక్షణ ఫలితాలకే ప్రాధాన్యత ఇవ్వాల్సి వస్తోంది. దీనివల్ల సహచరులతో ఉండాల్సిన అనుబంధం తగ్గి, జట్టు సభ్యుల మధ్య దూరం పెరుగుతోంది. కార్యాలయం ఒక సామాజిక వేదికగా ఉండాల్సిన చోట, ఇప్పుడు వ్యక్తిగత భద్రత కోసం పోటీ పెరిగిన పరిస్థితి కనిపిస్తోంది. అమెరికాకు చెందిన అమెరికన్ సైకాలజికల్ అసోసియేషన్ నివేదికల ప్రకారం, ఉద్యోగ భద్రత లోపించడం వల్ల ఉద్యోగుల్లో ఆందోళన, నిరాశ వంటి మానసిక సమస్యలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల కారణంగా నైపుణ్యం కలిగిన ఉద్యోగులు సైతం సంస్థలను వదిలి వెళ్లాలని భావిస్తున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. ఇలాంటి సందర్భాల్లో యాజమాన్యం పారదర్శకత చాలా కీలకం. హార్వర్డ్ బిజినెస్ రివ్యూ సూచించినట్లుగా, సంస్థలు నిజాయితీతో కూడిన సమాచారాన్ని ఉద్యోగులతో పంచుకున్నప్పుడు మాత్రమే అపోహలు తగ్గి, నమ్మకం పెరుగుతుంది. మొత్తంగా లేఆఫ్స్ అనేవి కేవలం ఆర్థిక నిర్ణయాలు మాత్రమే కాకుండా, ఉద్యోగుల భావోద్వేగాలతో ముడిపడి ఉన్న అంశమని నిపుణులు చెబుతున్నారు. సంస్థలు ఈ విషయాన్ని గుర్తించి, మానవీయ దృక్పథంతో వ్యవహరించినప్పుడే తమ ప్రతిష్టను కాపాడుకోగలవని అభిప్రాయపడుతున్నారు.



# యూపీఐ చెల్లింపులకు కొత్త నిబంధనలు




**వేద న్యూస్ డెస్క్:**

డిజిటల్ చెల్లింపుల్లో విస్తృతంగా వినియోగంలో ఉన్న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్త మార్పులకు శ్రీకారం చుట్టింది. యూపీఐ ద్వారా రూ.10 వేలకుపైగా నగదు పంపినప్పుడు ఒక గంట పాటు 'వెయిటింగ్ సమయం' అమలు చేయాలనే ప్రతిపాదనపై తాజాగా వివరణ ఇచ్చింది. ప్రస్తుతం యూపీఐ ద్వారా చెల్లింపులు క్షణాల్లో పూర్తవుతుండగా, సైబర్ మోసాలను అరికట్టే లక్ష్యంతో ఈ కొత్త నిబంధనలను తీసుకురావాలని భావిస్తున్నారు. ఈ ప్రతిపాదన ప్రకారం, కొత్తగా ఎవరైనా లబ్ధిదారునికి రూ.10 వేలకుపైగా నగదు పంపితే, ఆ లావాదేవీ వెంటనే పూర్తికాకుండా ఒక గంట తర్వాతే ఆ మొత్తము లబ్ధిదారుడి ఖాతాలో జమ అవుతుంది. అయితే ఈ నిబంధనకు కొన్ని మినహాయింపులు కూడా ఉన్నాయి. ఇప్పటికే నమోదైన లబ్ధిదారులకు లేదా వ్యాపారులకు చెల్లింపులు చేస్తే ఎలాంటి ఆలస్యం ఉండదు. అలాగే వినియోగదారులు తమకు నమ్మకమైన వ్యక్తులను ముందుగానే 'వైట్ లిస్ట్'లో చేర్చుకుంటే, వారికి చేసే చెల్లింపులు వెంటనే పూర్తవుతాయి. కొత్త లబ్ధిదారులకు మాత్రమే ఈ వెయిటింగ్ సమయం వర్తిస్తుంది. ఈ మార్పులపై బ్యాంకులు, ఆర్థిక సాంకేతిక సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. యూపీఐ చెల్లింపుల వేగమే దీనికి ప్రధాన ఆకర్షణగా ఉండగా, ఒక గంట ఆలస్యం చేయడం వల్ల వినియోగదారులు నగదు లావాదేవీల వైపు మళ్లే అవకాశముందని వారు భావిస్తున్నారు. ఇక నిపుణులు కూడా ఈ నిర్ణయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. సైబర్ మోసాలను తగ్గించేందుకు చర్యలు అవసరమే అయినప్పటికీ, చెల్లింపులను ఆలస్యం చేయడం కంటే మోసగాళ్లను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు. మొత్తంగా చూస్తే ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే యూపీఐ లావాదేవీలపై గణనీయమైన ప్రభావం పడే అవకాశముంది. వేగవంతమైన డిజిటల్ చెల్లింపుల వ్యవస్థపై ఇది ఎలాంటి ప్రభావం చూపుతుందో చూడాల్సి ఉంది.

# వాహనాల ధరలు మళ్లీ పెరుగుతాయా?

**వేద న్యూస్ డెస్క్:**




ఇప్పటికే వాహనాల నిర్వహణ ఖర్చులు పెరిగి సామాన్యుడిపై భారం పెరుగుతున్న వేళ, మరోసారి వాహనాల ధరలు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయంగా నెలకొన్న యుద్ధ పరిస్థితులు, ముడి సరుకుల ధరల పెరుగుదల కారణంగా ఆటోమొబైల్ రంగంపై ఒత్తిడి పెరిగినట్లు సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ అధ్యక్షుడు శైలేశ్ చంద్ర తెలిపారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు సరఫరా వ్యవస్థను దెబ్బతీస్తున్నాయి. ముఖ్యంగా వాహనాల తయారీలో ఉపయోగించే లోహాలు, ఇతర ముడి పదార్థాల ధరలు గణనీయంగా పెరిగాయి. ఈ పరిస్థితి వాహన తయారీ సంస్థలపై అదనపు భారం మోపుతోంది. ఇప్పటికే కొన్ని సంస్థలు వాహనాల ధరలను పెంచినప్పటికీ, ఖర్చులు ఇలాగే కొనసాగితే మరో విడత ధరల పెంపు తప్పదని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా ఉక్కు, అల్యూమినియం వంటి ముడి పదార్థాల ధరలు పెరగడం, రవాణా ఖర్చులు అధికమవడం, అంతర్జాతీయ సరఫరా గొలుసులో అంతరాయాలు ఏర్పడటం వంటి అంశాలు వాహన తయారీ వ్యయాన్ని పెంచుతున్నాయి. దీంతో తయారీదారులు తమ లాభాలను నిలబెట్టుకోవడానికి ధరలను సవరించే దిశగా ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రాబోయే నాలుగు నుంచి ఐదు వారాల్లో పరిస్థితులపై స్పష్టత వచ్చే అవకాశముందని శైలేశ్ చంద్ర తెలిపారు. ముడి సరుకుల ధరలు, అంతర్జాతీయ పరిస్థితుల మార్పులను పరిశీలించిన తరువాతే వాహనాల ధరల పెంపుపై తుది నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే మధ్యతరగతి ప్రజలపై, ముఖ్యంగా కొత్త వాహనాలు కొనుగోలు చేయాలని భావిస్తున్నవారిపై అదనపు ఆర్థిక భారం పడే అవకాశం ఉంది. ఇప్పటికే ఇంధన ధరలు, నిర్వహణ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో వాహన కొనుగోలు నిర్ణయాన్ని వాయిదా వేసే పరిస్థితులు కూడా ఏర్పడవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా చూస్తే అంతర్జాతీయ పరిస్థితులు స్థిరపడకపోతే వాహనాల ధరలు మళ్లీ పెరగడం ఖాయమని పరిశ్రమ వర్గాలు సూచిస్తున్నాయి.

# హైదరాబాద్ మ్యాచ్‌కు ధోని రెడీ?

**వేద న్యూస్ డెస్క్:**



ఐపీఎల్ 2026లో వరుస విజయాలతో దూసుకుపోతున్న చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు శుభవార్త అందింది. జట్టు దిగ్గజ ఆటగాడు మహేంద్ర సింగ్ ధోనీ గాయం నుంచి కోలుకుని త్వరలోనే మైదానం లోకి తిరిగి రావచ్చని సమాచారం. సన్‌రైజర్స్‌తో జరగనున్న కీలక మ్యాచ్‌కు ఆయన అందుబాటులోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం, ధోనీ కాలి కండరాల గాయం నుంచి దాదాపు పూర్తిగా కోలుకున్నాడు. తుది ఫిట్‌నెస్ పరీక్ష అనంతరం ఆయన హైదరాబాద్ ప్రయాణంపై స్పష్టత రానుంది. ఒకవేళ అతను జట్టులోకి తిరిగి వస్తే, అది చెన్నైకు భారీ బలం కావడం ఖాయం. ఈ సీజన్ ఆరంభంలో ధోనీ లేని లోటును భర్తీ చేయడానికి సంజూ శాంసన్ వికెట్ కీపింగ్ బాధ్యతలు నిర్వహించాడు. అయితే ధోనీ తిరిగి వస్తే, వికెట్ల వెనుక తన చురుకుదనంతో మళ్లీ మెరుపులు మెరిపించనున్నాడు. మైదానంలో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌కు అతను ఇచ్చే సూచనలు జట్టు విజయాల్లో కీలకంగా మారనున్నాయి. వికెట్ కీపింగ్‌తో పాటు ఫినిషర్‌గా కూడా ధోనీ తన విలువను నిరూపిస్తున్నాడు. గత సీజన్లలో అతని దూకుడు బ్యాటింగ్ జట్టుకు ఎన్నో విజయాలు అందించింది. ప్రస్తుతం మధ్యతరగతి బ్యాటింగ్‌ను బలోపేతం చేయాలంటే ధోనీ రాక ఎంతో కీలకమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక వరుస విజయాలతో ఉత్సాహంగా ఉన్న చెన్నై జట్టు, అదే జోరును కొనసాగించేందుకు సిద్ధమైంది. ఏప్రిల్ 18న హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో సన్‌రైజర్స్‌తో ఈ పోరు జరగనుంది. ధోనీ తిరిగి బరిలోకి దిగుతాడా లేదా అన్నది అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# సూర్య కెప్టెన్సీపై ముప్పు

**వేద న్యూస్ డెస్క్:**



భారత టీ20 జట్టు సారథి సూర్యకుమార్ యాదవ్ కెరీర్ ప్రస్తుతం కీలక దశలో ఉంది. జట్టును విజయపథంలో నడిపించినప్పటికీ, వ్యక్తిగతంగా బ్యాటింగ్‌లో స్థిరమైన ప్రదర్శన ఇవ్వలేకపోవడం అతని నాయకత్వంపై సందేహాలు రేకెత్తిస్తోంది. తాజాగా జరుగుతున్న లీగ్ పోటీల్లో కూడా అతను పరుగులు సాధించడంలో ఇబ్బంది పడుతున్నాడు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని బీసీసీఐ భవిష్యత్ ప్రణాళికలపై దృష్టి సారించింది. రాబోయే కీలక టోర్నమెంట్‌లను దృష్టిలో పెట్టుకుని కొత్త నాయకత్వాన్ని తయారు చేయాలనే ఆలోచనలో ఉందని సమాచారం. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ మద్దతు ఉన్నప్పటికీ, మైదానంలో ఆటగాడిగా రాణించడం ఇప్పుడు సూర్యకు అత్యవసరమైంది త్వరలో జరిగే ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలు అతనికి కీలకంగా మారనున్నాయి. ఈ సిరీస్‌లలో మెరుగైన ప్రదర్శన ఇస్తేనే కెప్టెన్సీ కొనసాగించే అవకాశాలు ఉంటాయి. లేదంటే నాయకత్వ మార్పు అనివార్యమవుతుందని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి. ఇదిలా ఉండగా, కొత్త సారథి రేసులో అక్షర్ పటేల్ ముందంజలో ఉన్నాడు. అతనితో పాటు శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి. వీరి ప్రదర్శనలను ఆధారంగా చేసుకుని తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. భవిష్యత్ లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని తీసుకునే ఈ నిర్ణయం భారత జట్టు మార్గాన్ని నిర్ణయించనుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# భారీ ధర ఆటగాడిపై సెహ్వాగ్ విమర్శలు

**వేద న్యూస్ డెస్క్:**



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్‌లో వరుస ఓటములతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కోల్‌కతా నైట్ రైడర్స్‌పై మాజీ భారత ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జట్టు తీసుకున్న కొన్ని నిర్ణయాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆయన విమర్శించారు. ప్రత్యేకంగా ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్‌పై భారీ మొత్తంలో పెట్టుబడి పెట్టడం జట్టుకు మైనస్‌గా మారిందని సెహ్వాగ్ అభిప్రాయపడ్డారు. ఐపీఎల్ వేలంలో దాదాపు రూ.25 కోట్లకు పైగా ఖర్చు చేసి అతడిని తీసుకోవడం సరైన నిర్ణయం కాదని పేర్కొన్నారు. ప్రస్తుతం గ్రీన్ ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేకపోవడంతో జట్టుకు ఉపయోగం లేకుండా పోతున్నాడని సెహ్వాగ్ అన్నారు. బ్యాటింగ్, బౌలింగ్ రెండింట్లోనూ అతడు ప్రభావం చూపలేకపోతున్నాడని విమర్శించారు. అవసరమైతే అతడిని తుది జట్టులో నుంచి తప్పించి ఇతర ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలని సూచించారు. జట్టు చేసిన తప్పును ఒప్పుకోవడంలో ఎలాంటి సంకోచం అవసరం లేదని, ప్రస్తుత పరిస్థితుల్లో సరైన నిర్ణయాలు తీసుకోవడం అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటివరకు ఆడిన మ్యాచ్‌ల్లో ఒక్క విజయం కూడా నమోదు చేయలేకపోయిన కోల్‌కతా జట్టు పాయింట్ల పట్టికలో అట్టడుగున కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో జట్టు వ్యూహాల్లో మార్పులు చేయకపోతే పరిస్థితి మరింత క్లిష్టమవుతుందని క్రీడా నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# రహానేకు జరిమానా

**వేద న్యూస్ డెస్క్:**



ఇండియన్ ప్రీమియర్ లీగ్లో కోల్‌కతా జట్టు కెప్టెన్ అజింక్య రహానేకు జరిమానా విధించారు. చెన్నై జట్టుతో జరిగిన మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా ఆయనపై రూ.12 లక్షల జరిమానా పడింది. కోల్‌కతా నైట్ రైడర్స్ మరియు చెన్నై సూపర్ కింగ్స్ మధ్య జరిగిన ఈ మ్యాచ్‌లో కోల్‌కతా నిర్ణీత సమయానికి ఓవర్లు పూర్తి చేయలేకపోయింది. దీనిని ఉల్లంఘనగా పరిగణించిన నిర్వాహకులు రహానేపై చర్యలు తీసుకున్నారు. ఐపీఎల్ నిబంధనల ప్రకారం స్లో ఓవర్ రేట్‌కు సంబంధించి మొదటి తప్పిదంగా పరిగణిస్తూ ఈ జరిమానా విధించినట్లు వెల్లడించారు. ఈ మ్యాచ్‌లో కోల్‌కతా జట్టు 32 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. ప్రస్తుత సీజన్‌లో ఆ జట్టు ప్రదర్శన నిరాశాజనకంగా కొనసాగుతోంది. ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా గెలవలేకపోవడం అభిమానుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని సంబంధిత నిబంధనల ప్రకారం ఈ జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు. ఇక కోల్‌కతా జట్టు తన తదుపరి మ్యాచ్‌ను గుజరాత్ టైటాన్స్‌తో ఆడనుంది. ఈ మ్యాచ్‌లోనైనా జట్టు విజయాన్ని నమోదు చేస్తుందా అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.

వేద న్యూస్

గురువారం ఏప్రిల్ 16, 2026

# ధనుష్ సినిమాలో సారా అర్జున్?



**వేద న్యూస్ డెస్క్:**

దక్షిణాది స్టార్ హీరో ధనుష్ తన కెరీర్‌లో వరుస సినిమాలతో బిజీగా కొనసాగుతూ మరో కొత్త ప్రాజెక్ట్‌తో వార్తల్లో నిలిచారు. నటుడిగా మాత్రమే కాకుండా దర్శకుడిగానూ రాణిస్తున్న ఆయన, ప్రస్తుతం పలు క్రేజీ ప్రాజెక్టులను పూర్తి చేసే పనిలో ఉన్నారు. ఇప్పటికే ఆయన ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న కర సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్రాన్ని ఈ నెలాఖరులోనే ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. యాక్షన్, ఎమోషన్ కలగలిపిన కథతో ఈ సినిమా ఉండబోతుందనే సమాచారం సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. ఇదిలా ఉండగా, దర్శకుడు తమిళరాసన్ పచ్చముత్తు దర్శకత్వం లో రూపొందనున్న మరో కొత్త చిత్రానికి ధనుష్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ సినిమా కాస్టింగ్ విషయంలో ఇటీవల ఆసక్తికరమైన మార్పులు చోటుచేసుకున్నాయి. మొదట ఈ చిత్రంలో కథా నాయికగా ఎంపికైన రుక్మిణీ వసంత్ ఇతర ప్రాజెక్టులతో బిజీగా ఉండటంతో ఈ సినిమాకు డేట్స్ కేటాయించలేక తప్పుకున్నట్లు తెలుస్తోంది. ఆమె స్థానంలో ఇప్పుడు బాలనటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న సారా అర్జున్ పేరు ముందుకు వచ్చినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ‘ధురంధర్’ సినిమాతో మరోసారి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన సారా, ఈసారి హీరోయిన్‌గా ధనుష్ సరసన నటించే అవకాశముందనే టాక్ వినిపిస్తోంది. ఇప్పటికీ ఈ విషయంపై అధికారిక ప్రకటన రాకపోయినప్పటికీ, ఈ క్రేజీ కాంబినేషన్‌పై అభిమానుల్లో ఆసక్తి పెరుగుతోంది. చిన్న వయసులోనే తన నటనతో మెప్పించిన సారా అర్జున్, హీరోయిన్‌గా ఈ ప్రాజెక్ట్ ద్వారా మరో మెట్టు ఎక్కే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తానికిడ ధనుష్ కొత్త సినిమాకు సంబంధించి వచ్చిన ఈ అప్‌డేట్ టాలీవుడ్, కోలీవుడ్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అధికారిక ప్రకటన వెలువడితే ఈ కాంబినేషన్‌పై మరింత స్పష్టత రానుంది.

# హారర్‌లోకి ఎమ్.ఎస్. రాజు.. ‘అగాధ’ ఫస్ట్ లుక్



**వేద న్యూస్ డెస్క్:**

తెలుగు సినీ పరిశ్రమలో ప్రేమకథలతో ప్రత్యేక గుర్తింపు పొందిన అగ్ర నిర్మాత, దర్శకుడు ఎమ్.ఎస్. రాజు ఇప్పుడు సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. ‘ఒక్కడు’, ‘వర్షం’, ‘నువ్వొస్తానంటే నేనొద్దంటానా’ వంటి క్లాసిక్ చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన ఆయన, ఈసారి పూర్తి భిన్నమైన హారర్ థ్రిల్లర్ జానర్‌లో అడుగుపెట్టడం విశేషం. తాజాగా ఆయన దర్శకత్వంలో రూపొందుతున్న అగాధ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైంది. “మనసును కదిలించినవాడుడ ఇప్పుడు భయపెడతాడు” అనే భావాన్ని ప్రతిబింబించే ట్యాగ్ లైన్‌తో వచ్చిన ఈ పోస్టర్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. ఇప్పటివరకు మెలోడీ, ప్రేమకథలతో ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న ఎమ్.ఎస్. రాజు, ఈసారి పూర్తిస్థాయి డార్క్ హారర్ కథను ఎంచుకోవడం టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. ఈ చిత్రం చీకటి శక్తులు, నిషేధించబడిన రహస్యాలు, రక్తంనమ్మకం వంటి అంశాల చుట్టూ తిరిగే ఉత్కంఠభరిత కథగా రూపొందుతున్నట్లు సమాచారం. శ్రీ ఆదివరాహ ప్రొడక్షన్స్ పతాకంపై తెరకెక్కుతున్న ఈ చిత్రానికి ఎమ్.ఎస్. రాజు స్వయంగా కథ, దర్శకత్వ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ సినిమాలో శ్రవణ్ రెడ్డి, ఉల్కా గుప్తా, జోవికా విజయ్‌కుమార్, జునైద్ సిద్ధీఖీ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సంగీతాన్ని చైతన్య వేగ అందిస్తుండగా, సినిమాటోగ్రఫీ బాధ్యతలను నాని చమిడిశెట్టి నిర్వహిస్తున్నారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో కనిపిస్తున్న డార్క్ వాతావరణం, భయానక ఎలిమెంట్స్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. కథలోని మిస్టరీ, థ్రిల్లింగ్ అంశాలు ప్రేక్షకులను కట్టిపడేసేలా ఉంటాయని చెబుతున్నారు.మొత్తానికి ప్రేమకథల దర్శకుడిగా పేరుగాంచిన ఎమ్.ఎస్. రాజు ఇప్పుడు హారర్ జానర్‌లోకి అడుగుపెట్టడంతో ‘అగాధ’ సినిమాపై అంచనాలు గణనీయంగా పెరిగాయి. ఈ చిత్రం విజయవంతమైతే, ఆయన కెరీర్‌లో మరో కొత్త దిశకు నాంది పలికినట్లే అవుతుంది.

## వరుణ్ తేజ్‌కు గాయం..

# షూటింగ్‌కు బ్రేక్



**వేద న్యూస్ డెస్క్:**

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ గాయపడిన ఘటన అభిమానుల్లో ఆందోళన కలిగించింది. ప్రస్తుతం ఆయన నటిస్తున్న బరి సినిమా కోసం ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం ప్రకారం, ఫుట్‌బాల్ ప్రాక్టీస్ చేస్తుండగా వరుణ్ తేజ్ కాలికి గాయం అయింది. వెంటనే చిత్ర యూనిట్ అప్రమత్తమై ఆయనను ఆసుపత్రికి తరలించింది. వైద్యులు పరీక్షించి చిన్నపాటి శస్త్రచికిత్స అవసరమని సూచించగా, వెంటనే సర్జరీ నిర్వహించారు. ఆ ఆపరేషన్ విజయవంతంగా పూర్తైనట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం వరుణ్ తేజ్ ఆసుపత్రిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయన ఆరోగ్యం స్థిరంగా ఉన్నప్పటికీ, పూర్తిగా కోలుకోవడానికి కొన్ని వారాల పాటు విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. దీంతో ‘బరి’ సినిమా షూటింగ్‌కు తాత్కాలికంగా విరామం ఇచ్చారు. ఆయన పూర్తిగా కోలుకున్న తర్వాతే తిరిగి షూటింగ్ ప్రారంభం కానుంది. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని దర్శకుడు యదు వంశీ రూపొందిస్తున్నారు. యాక్షన్‌తో కూడిన ఈ హై-వోల్టేజ్ డ్రామాలో వరుణ్ తేజ్ కొత్త లుక్‌లో కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాను 2027 సంక్రాంతి సందర్భంగా విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నారు. ఇదిలా ఉండగా, వరుణ్ తేజ్ గాయంపై సోషల్ మీడియాలో అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. త్వరగా కోలుకోవాలని శుభాకాంక్షలు తెలియజేస్తూ “గెట్ వెల్ సూన్” పోస్టులు పెడుతున్నారు. సినీ ప్రముఖులు కూడా ఆయన ఆరోగ్యం గురించి తెలుసుకుంటూ మద్దతు తెలుపుతున్నారు. మొత్తానికిడ అనూహ్యంగా జరిగిన ఈ ఘటనతో షూటింగ్‌కు బ్రేక్ పడినా, వరుణ్ తేజ్ కోలుకున్న తర్వాత ‘బరి’ మరింత ఉత్సాహంతో ముందుకు సాగనుంది.


# పెళ్లి ఆగింది.. మళ్లీ సినిమాల్లోకి

**వేద న్యూస్ డెస్క్:**

సినీ పరిశ్రమలో ప్రేమలు, పెళ్లిళ్లు, విడిపోవడం వంటి పరిణామాలు తరచూ జరుగుతూనే ఉంటాయి. అయితే కొన్ని సంఘటనలు మాత్రం అభిమానులను ఆశ్చర్యానికి గురి చేస్తాయి. అలాంటి పరిణామమే ప్రముఖ నటి నివేదా పేతురాజు జీవితంలో తాజాగా చోటుచేసుకుంది. వ్యక్తిగత జీవితంలో ఎదురైన అనూహ్య మలుపుతో కొంతకాలం వెనుకబడిన ఆమె, ఇప్పుడు మళ్లీ సినిమాల వైపు అడుగులు వేస్తుండటం ఆసక్తిని రేకెత్తిస్తోంది. తెలుగు చిత్ర పరిశ్రమలో తక్కువ సినిమాలే చేసినప్పటికీ, తన అందం, సహజమైన నటనతో నివేదా పేతురాజు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. కెరీర్ ప్రారంభంలోనే గ్లామర్‌కు దూరంగా ఉండి, కథకు ప్రాధాన్యత ఉన్న పాత్రలను ఎంచుకోవడం ద్వారా ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. ఆ తర్వాత కాలంలో వాణిజ్యపరమైన చిత్రాల్లో గ్లామర్ పాత్రలు కూడా చేస్తూ యువతలో మంచి క్రేజ్ సంపాదించింది. ఇదిలా ఉండగా, కొంతకాలం క్రితం తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాన్ని సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకుంది. తన ప్రియుడిని పరిచయం చేస్తూ త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నట్లు ప్రకటించడంతో అభిమానుల్లో ఆనందం నెలకొంది. ఆమె వివాహ వేడుక కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూసిన అభిమానులకు అనూహ్యంగా షాక్ తగిలింది. పెళ్లి పీటల వరకు వెళ్లిన ఈ సంబంధం మధ్యలోనే ముగిసిపోవడం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ బ్రేకప్ అనంతరం ఆమె సోషల్ మీడియాలో తన ప్రియుడితో ఉన్న ఫోటోలను తొలగించడం ద్వారా పరోక్షంగా ఈ విషయాన్ని వెల్లడించింది. వ్యక్తిగత జీవితంలో జరిగిన ఈ పరిణామాల వల్ల కొంతకాలం సినిమాలకు దూరంగా ఉన్న నివేదా, తనను తాను మళ్లీ సమతుల్యం చేసుకునే ప్రయత్నం చేసినట్లు సమాచారం. కుటుంబ సభ్యులు, సన్నిహితుల సహకారంతో ఈ కష్టకాలాన్ని అధిగమించిన ఆమె, ఇప్పుడు తిరిగి తన కెరీర్‌పై పూర్తి దృష్టి సారించింది. ఇప్పటికే విశ్వక్ సేన్ నటించిన “ధమ్కీ” చిత్రంలో తన గ్లామర్‌తో పాటు నటనతో కూడా ప్రేక్షకులను ఆకట్టుకున్న నివేదా, హీరోయిన్‌గా మాత్రమే కాకుండా కీలక పాత్రల్లో కూడా తన ప్రతిభను నిరూపించుకుంది. భిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ నటనలో వైవిధ్యం చూపించడమే తన లక్ష్యమని ఆమె సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం కొత్త కథలను పరిశీలిస్తూ, తనకు సరిపడే పాత్రలను జాగ్రత్తగా ఎంపిక చేసుకుంటూ ముందుకు సాగుతోంది. ఒకవైపు మహిళా ప్రాధాన్యత ఉన్న కథలు, మరోవైపు వాణిజ్యపరమైన చిత్రాలుఈ రెండింటికీ సమాన ప్రాధాన్యత ఇస్తూ తన కెరీర్‌ను మళ్లీ గాడిలో పెట్టే ప్రయత్నంలో ఉంది. దర్శకులు, నిర్మాతలు కూడా ఆమెతో పనిచేయడానికి ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి, వ్యక్తిగత జీవితంలో ఎదురైన అడ్డంకులను పక్కనపెట్టి, మళ్లీ కెరీర్‌పై దృష్టి పెట్టిన నివేదా పేతురాజు, ఇక ముందు మరింత బలంగా తిరిగి రావాలని అభిమానులు ఆశిస్తున్నారు.



# ‘వాళ 3’ ఫస్ట్ లుక్ విడుదల




**వేద న్యూస్ డెస్క్:**

మలయాళ చిత్ర పరిశ్రమలో విజయవంతమైన ఫ్రాంచైజీలలో ఒకటిగా నిలిచిన వాళ సిరీస్ నుంచి మూడవ భాగం రాబోతోంది. తాజాగా వాళ 3 ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ప్రముఖ దర్శకుడు విపిన్ దాస్ విడుదల చేశారు. ‘బిలియన్ గర్ల్స్ బయోపిక్’ అనే కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా ఇప్పటికే సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. గత రెండు భాగాల్లో యువకుల కథలను చూపించిన మేకర్స్, ఈసారి పూర్తిగా మహిళా ప్రధాన పాత్రలతో కథను రూపొందించడం ప్రత్యేకంగా నిలుస్తోంది. మహిళల జీవితాలు, వారి ప్రయాణం, విజయాలు, సవాళ్లను ప్రతిబింబించేలా ఈ చిత్రం ఉండబోతుందని సమాచారం. ఈ చిత్రానికి కథను విపిన్ దాస్ అందించగా, కొత్త దర్శకుడు విశ్వన్ శ్రీజిత్ దర్శకత్వం వహించనున్నారు. కొత్త ప్రతిభను వెండితెరకు పరిచయం చేయాలనే లక్ష్యంతో ఈ ఫ్రాంచైజీని ప్రారంభించామని, అదే సంప్రదాయాన్ని ‘వాళ 3’తో కూడా కొనసాగిస్తామని చిత్ర బృందం తెలిపింది.


# సెప్టెంబర్ 2న ‘పంజా’ రీ రిలీజ్




**వేద న్యూస్ డెస్క్:**

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులకు అదిరిపోయే శుభవార్త అందింది. దర్శకుడు విష్ణు వర్ధన్ తెరకెక్కించిన స్టైలిష్ యాక్షన్ ఎంటర్టైనర్ పంజా మరోసారి థియేటర్లలో సందడి చేయడానికి సిద్ధమవుతోంది. అప్పట్లో విడుదల సమయంలో ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయిన ఈ చిత్రం, తర్వాత కాలంలో మాత్రం కల్ట్ క్లాసిక్‌గా గుర్తింపు పొందింది. పవన్ కళ్యాణ్ స్టైలిష్ లుక్, యాక్షన్ ఎలిమెంట్స్, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ కారణంగా ఈ సినిమాకు ప్రత్యేక ఫ్యాన్ బేస్ ఏర్పడింది. ఇప్పుడు అదే చిత్రాన్ని ఆధునిక 4కే టెక్నాలజీతో రీ రిలీజ్ చేయాలని మేకర్స్ నిర్ణయించినట్లు సమాచారం. ప్రతి ఏడాది సెప్టెంబర్ 2న పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఆయన సినిమాలను మళ్లీ విడుదల చేయడం ఆనవాయితీగా మారింది. ఈ క్రమంలోనే 2026 సెప్టెంబర్ 2న ‘పంజా’ను గ్రాండ్‌గా విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఈ సందర్భంగా థియేటర్లలో ప్రత్యేక షోలు, అభిమానుల వేడుకలు ఉండే అవకాశం ఉంది. ఈ చిత్రానికి సంగీతం అందించిన యువన్ శంకర్ రాజా కంపోజిషన్స్ ఇప్పటికీ ట్రెండీగా వినిపిస్తుండగా, సినిమాటోగ్రఫీ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అందుకే కొత్త తరానికి చెందిన ప్రేక్షకుల్లో కూడా ఈ సినిమాపై మంచి ఆసక్తి కనిపిస్తోంది. గతంలో ఖలేజా, ఆరెంజ్ వంటి చిత్రాలు రీ రిలీజ్‌లో భారీ వసూళ్లు సాధించిన నేపథ్యంలో, ఇప్పుడు ‘పంజా’ కూడా అదే బాటలో సెన్సేషన్ సృష్టిస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు. మొత్తానికి పవన్ కళ్యాణ్ బర్త్‌డే కానుకగా రాబోతున్న ‘పంజా’ రీ రిలీజ్ టాలీవుడ్‌లో మరోసారి థియేటర్లకు జోష్ తీసుకురానుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

# అనన్య నాగళ్ల హాట్ ఫోజులు



**వేద న్యూస్ డెస్క్:**

తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన అనన్య నాగళ్ల ఒక ప్రముఖ తెలుగు సినీ నటి. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగాన్ని వదిలి, చిన్న చిన్న చిత్రాల ద్వారా సినీ రంగంలోకి అడుగుపెట్టిన ఆమె, ‘మల్లేశం’ చిత్రంతో కథానాయికగా మంచి గుర్తింపు పొందింది. అనంతరం ‘వకీల్ సాబ్’, ‘పొట్టేల్’ వంటి చిత్రాలలో నటిస్తూ గ్లామర్‌తో పాటు నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలతో తెలుగు సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. ఇప్పటివరకు పలు చిత్రాలలో పల్లెటూరి అమ్మాయి పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ అందాల తార, ప్రస్తుతం తన శైలి మార్చి గ్లామర్ మోతాదును పెంచుతోంది. ఇటీవల ఆమె తన సామాజిక మాధ్యమ వేదికలో పంచుకున్న ఆకర్షణీయ చిత్రాలు విస్తృతంగా ప్రాచుర్యం పొందుతున్నాయి. ఈ చిత్రాలను చూసి అభిమానులు ముగ్ధులవుతుండగా, యువతలో మంచి ఆదరణ లభిస్తోంది. ప్రస్తుతం అనన్య నాగళ్ల తాజా అందాల ప్రదర్శన నెట్టింట చర్చనీయాంశంగా మారింది.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073